మహబూబ్‌నగర్
వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగుళాంబ గద్వాల / నారాయణపేట

# బసవేశ్వరుని బోధనలు ఆదర్శనీయం

**ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, కలెక్టర్ విజయేంద్ర బోయితో**

**కలిసి బసవేశ్వర విగ్రహం వద్ద నివాళి**



బసవేశ్వర విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే యెన్నం, కలెక్టర్

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఏప్రిల్ 30 ప్రభాతవార్త:** నేటి తరానికి బసవేశ్వరుని బోధనలు ఆదర్శప్రాయమైనవి అని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బసవేశ్వరుని జయంతి సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పద్మావతి కాలనీ గ్రీన్ బెల్ట్‌లోని బసవేశ్వరుని విగ్రహానికి ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస రెడ్డి, జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వ్యక్తుల జీవితాలను సమాజ గమనాన్ని ప్రభావితం చేసే విధంగా బసవేశ్వరుడు తన స్వంత ఒరవడిలో కొత్త ధర్మాన్ని సృష్టించారని, అదే లింగాయత్ ధర్మమని, అనాదిగా వస్తున్న మూఢ నమ్మకాలను, ఆచారాలను బసవేశ్వరుడు తీవ్రంగా ఖండించారన్నారు. పూర్వం స్త్రీలకు, అణగారిన వర్గాలకు ధార్మిక, సామాజిక, ఆర్థిక, రాజకీయ హక్కులు ఉండేవి కావని, బసవేశ్వరుని ఆగమనంతో అందరూ అన్ని బంధాల నుండి విముక్తి పొందారన్నారు. వర్గ, వర్ణ, లింగ భేదాలను తెంచి ఒక నూతన సమ సమాజాన్ని ఆయన స్థాపించారని, సమాజ నిర్మాణంలో ఆయన దార్శనికత నాయకత్వం ఇన్ని శతాబ్దాల తర్వాత కూడ స్ఫూర్తినిస్తూనే ఉన్నాయన్నారు. బసవేశ్వరుడు సమ సమాజ స్థాపనకై దేవుడినే భక్తుడి వద్దకు తీసుకురావడానికి ఇష్టలింగాన్ని కనిపెట్టారని, పరమ శివునికి ప్రతిరూపమైన ఇష్టలింగాన్ని చేతికిచ్చి గుడి సంస్కృతిని, కుల వ్యవస్థను అంతమొందించారని అన్నారు. అగ్రవర్ణాల వారు నిమ్నజాతుల వారిని , అణగారిన వర్గాల వారిని గుడిలోనికి రానివ్వనపుడు ఆ గుడిలోని లింగాన్ని తెచ్చి వారి ఒడిలోన ఉంచిన మహనీయుడు బసవేశ్వరుడని, నేడు మనం ఆచరించే యోగాని ఆనాడే ఆయన తన ఇష్టలింగ పూజలో జత చేశారని గుర్తు చేశారు. జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి మాట్లాడుతూ వీరశైవ సంప్రదాయాన్ని మహోజ్వలంగా ప్రజల్లోకి తీసుకెళ్లిన గొప్ప భక్తుడు బసవేశ్వరుడు అన్నారు . లింగాయత ధర్మ సృష్టికర్త అయిన మహాత్మా బసవేశ్వరుడు మహా మానవతావాది, సంఘ సంస్కర్త, కుల, మత, వర్గ, వర్ణ వ్యవస్థను రూపుమాపడానికి క్రీ.శ. 12వ శతాబ్దంలోనే పూనుకున్న సాంఘిక విప్లవకారుడు. స్త్రీ పురుష అసమానతలను తొలగించడానికి కృషి చేసిన అభ్యుదయవాది బసవేశ్వరుడు అని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పోరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, సిజె బెనహర్, గుండా మనోహర్, ప్రవీణ్ కుమార్ బిసి సంక్షేమ శాఖ అధికారిని ఆర్.ఇందిర తదితరులు పాల్గొన్నారు.

# పదవ తరగతిలో గద్వాల జిల్లా 26వ స్థానం

**గద్వాల, ఏప్రిల్ 30 ప్రభాతవార్త :** పదవ తరగతి పరీక్షల్లో 91.74 శాతం ఉత్తీర్ణతతో జోగులాంబ గద్వాల జిల్లా రాష్ట్రంలో 26వ స్థానాన్ని సాధించినట్లు జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత సంవత్సరం 81.38 శాతం ఉన్న ఉత్తీర్ణత ఈ సంవత్సరం 91.74 కి పెరిగి, ఏకంగా 10.36 శాతం పెరుగుదల నమోదైందని తెలిపారు. జిల్లాలో మొత్తం 7569 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 3759 మంది బాలురు, 3810 మంది బాలికలు ఉన్నారని తెలిపారు. బాలురలో 89.49, శాతం బాలికలలో 93.96 శాతం ఉత్తీర్ణత శాతం నమోదైందని తెలిపారు. విద్యార్థుల విద్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిన నేపథ్యంలో, పాఠశాలల పర్యవేక్షణ, ప్రధానోపాధ్యాయులతో సమీక్షలు, మౌలిక వసతుల అభివృద్ధి, హాజరు పెంపు చర్యలు తీసుకున్నామని కలెక్టర్ తెలిపారు. గత సంవత్సరం 32వ స్థానంలో ఉన్న గద్వాల జిల్లా ఈ సంవత్సరం 26వ స్థానానికి చేరడం ఒక మంచి అభివృద్ధి సూచికగా భావిస్తున్నామని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు కలసి చూపిన కృషి వల్లే ఈ ఉత్తమ ఫలితాలను సాధించగలిగామని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇంకా మెరుగైన ఫలితాల కోసం మరింత కృషి చేసి విద్యారంగాన్ని మరింత అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. పదవ తరగతి ఫలితాల్లో విజయం సాధించిన విద్యార్థులందరికీ అభినందనలు తెలిపారు.

# రైతుకు భరోసా.. భూభారతి చట్టం..

**నాటి ధరణితో రైతన్న అవస్థలు ..**

**ఇందిరమ్మ రాజ్యంలో ప్రజా సంక్షేమం**

**రెవెన్యూ గృహ నిర్మాణ శాఖ మంత్రి**

**పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి పొంగులేటి




ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి

**చిన్న చింతకుంట, ఏప్రిల్ 30 ప్రభాతవార్త :** రైతన్నకు సంబంధించిన భూ సమస్యలను పరిష్కరించేందుకు ప్రజాప్రభుత్వం తీసుకొచ్చిన భూభారతి 2025 చట్టంతో రైతులకు భరోసాగా నిలుస్తుందని రెవిన్యూ గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. బుధవారం బుధవారం మండలంలోని శ్రీ కురుమూర్తి దేవస్థానం వద్ద చిన్న చింతకుంట కౌకుంట్ల మండలాలకు సంబంధించిన రైతులకు భూభారతి అవగాహన సదస్సు ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ గత ప్రభుత్వం రైతుల అభిప్రాయం లేకుండానే నాలుగు గోడల మధ్య నలుగురు వ్యక్తులతో తీసుకొచ్చిన ధరణి చట్టంతో రైతులు ఎన్నో అవస్థలు పడ్డారని ఆయన దుయ్యబట్టారు. ఈ భూభారతి చట్టాన్ని తీసుకురావడానికి దేశంలోని 18 రాష్ట్రాలలో అధికారుల బృందం పర్యటించి అక్కడి వ్యవసాయ చట్టాలను అధ్యయనం చేసి భూభారతి చట్టాన్ని రూపొందించామని ఆయన తెలిపారు. ధరణిలో భూ సమస్యల పరిష్కారానికి గాను అధికారుల చుట్టూ తిరగలేక రైతన్నలు ఎన్నో అవస్థలు పడ్డారని అలాంటి అవస్థలను పడకుండా రైతులకు సంబంధించిన భూ సమస్యల పరిష్కారానికి రెవిన్యూ అధికారులకు దరఖాస్తు చేసుకుంటే అక్కడనే పరిష్కారం లభిస్తుందని ఇది రైతులకు ఎంతో ఊరట నిస్తుందని ఆయన తెలిపారు. ఈ భూభారతి చట్టంలో 18 అంశాలను పొందుపరిచామని ఈ అంశాలతో భూ సమస్యలను పరిష్కారం లభిస్తుందని ఆయన తెలిపారు. ఈ భూభారతి చట్టంలో భూమికి సంబంధించిన మ్యాప్ కూడా అందుబాటులో ఉంచుతున్నామని ఈ భూములను సర్వే చేసేందుకు ప్రతి మండలంలో పదిమంది సర్వేయర్లను నియమిస్తామని ఆయన తెలిపారు. గ్రామ పరిపాలన వ్యవస్థ ను విఆర్వోలు చూసేవారని గత ప్రభుత్వం నియంతగా వివరిస్తూ విఆర్వో వ్యవస్థను రద్దుచేసి వారి పొట్ట కొట్టిందని ఈ ప్రజా ప్రభుత్వం గ్రామ పరిపాలన వ్యవస్థ ప్రతిష్టంగా ఉండేందుకు వీఆర్వో వ్యవస్థను తీసుకొస్తున్నామని ఆయన తెలిపారు. ప్రజా ప్రభుత్వం లోనే అన్ని వర్గాల సంక్షేమాన్ని రేవంత్ రెడ్డి అంకిత భావంతో పనిచేస్తున్నారని ఈ భూభారత చట్టం తీసుకురావడంలో సీఎం రేవంత్ గాని రెవెన్యూ మంత్రిగా నాకు గాని ఎలాంటి దురుద్దేశం లేదని రైతన్న సంక్షేమం కోసం వారి భూ సమస్యలను తొలగించేందుకు ఈ భూభారత చట్టాన్ని తీసుకొచ్చామని ఆయన తెలిపారు .ఈనెల 14న భూభాగ చట్టాన్ని నాలుగు జిల్లాలలో అవగాహన సదస్సుల పేరిట రైతులకు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని ఇకపై నేరుగా రెవిన్యూ అధికారులే గ్రామాలలోకి వెళ్లి గ్రామ ప్రజలకు రైతులకు ఈ చట్టం పై అవగాహన కల్పిస్తారని ఆయన తెలిపారు రాష్ట్రంలో ప్రభుత్వ సర్వేయర్లు 300 పైగా ఉన్నారని వీటిని 1000 కి పెంచుతామని మంత్రి తెలిపారు అప్పుల కుప్పగా మార్చిన గత ప్రభుత్వం తమ స్వార్థాల కోసం చట్టాలను తీసుకొచ్చి ప్రజలను కష్టాలపాలు చేశారని అలాంటి ప్రభుత్వాన్ని ప్రజలు తరిమికొట్టారని ఆయన తెలిపారు గత కెసిఆర్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఏ గ్రామంలో కూడా నిర్మించి ఇవ్వలేదని ఇందిరమ్మ ప్రభుత్వంలో ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లను నిర్మించి ఇస్తామని ఆయన తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని ఆర్థిక ఇబ్బందులు ఉన్న నెరవేరుస్తున్నందుకు బాధ కలుగుతుందా అంటూ కేసీఆర్‌ను ప్రశ్నించారు. ప్రజా ప్రభుత్వంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చి తీరుతామని ఈ ప్రభుత్వం మాటల ప్రభుత్వము కాదు చేతల ప్రభుత్వమన్నారు నూతనంగా ఏర్పడ్డ కౌకుంట్ల మండలంలో రెవెన్యూ కార్యాలయం నిర్మిస్తామని నియోజకవర్గంలో ఏదో ఒక మండలానికి సబ్ రిజిస్టర్ కార్యాలయం మంజూరు చేస్తానని సభలో హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ప్రభుత్వం తీసుకొచ్చిన భూభారతి 2025 చట్టం చారిత్రాత్మకమని -మిగతా3లో..



సదస్సుకు హాజరైన ప్రజలు

# 10 సంవత్సరాలు పాలన అప్పుల ఊబిలోకి..

- బడుగు, బలహీన వర్గాల అభివృద్ధే కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యం
- అభివృద్ధిని చూసి ఓర్వలేకనే కాంగ్రెస్ పార్టీపై విమర్శలు
- ఎంపీ డాక్టర్ మల్లు రవి, ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ డాక్టర్ మల్లు రవి, ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఏప్రిల్ 30 ప్రభాతవార్త:** బీఆర్ఎస్ ప్రభుత్వం 10 సంవత్సరాలు పాలన కొనసాగించి ప్రజలను ఎన్నో ఇబ్బందులకు గురి ఆర్థికంగా ఉన్న తెలంగాణను అప్పుల ఊబిలోకి నెట్టిందని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు మల్లురవి, ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డిలు అన్నారు. నేడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వచ్చిన ఏడాది కాలంలోనే బడుగు బలహీన వర్గాల ప్రజలకు లబ్ధి చేకూరే విధంగా సంక్షేమ పథకాలు అందించడంతో అది చూసి జీర్ణించుకోలేక మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం అవివేకమని ఎంపీ డాక్టర్ మల్లురవి, ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డిలు పేర్కొన్నారు. బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎంపీ డాక్టర్ మల్లురవి,ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డిలు మాట్లాడుతూ ఇటీవల బీఆర్ఎస్ పార్టీ నిర్వహించిన 25 సంవత్సరాల రజతోత్సవ కార్యక్రమాన్ని వరంగల్లో నిర్వహించారని ఆ సభలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏ ఒక్క కార్యక్రమాన్ని నిర్వహించడం లేదని అబద్ధపు ప్రచారం చేయడం ఆయన స్థాయికి సరికాదని ఎద్దేవా చేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఆరోగ్యశ్రీ పథకానికి రూ.5లక్షల -మిగతా3లో..

# యాసంగి పంట కొనుగోలు వేగవంతం చేయాలి

**రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

**ధాన్యం కొనుగోలుపై జిల్లా కలెక్టర్‌లు ప్రత్యేకంగా పర్యవేక్షించాలి**

**తాలు, తరుగు పేరిట ఎటువంటి కోతలు పెట్టవద్దు**

**ప్రభుత్వ పరిధిలో అత్యధికంగా రైస్ మిల్లులు మిల్లింగ్ చేసేలా చర్యలు**

**ధాన్యం కొనుగోలుపై వీడియో**

**కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన మంత్రి ఉత్తమ్, మంత్రి తుమ్మల**




విసిలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి , విసిలో పాల్గొన్న జిల్లాల అధికారులు

**మహబూబ్‌నగర్ బ్యూరో ఏప్రిల్ 30 ప్రభాతవార్త:** యాసంగి పంట కొనుగోలు వేగవంతం చేయాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు.బుధవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వర రావు, పౌర సరఫరాల శాఖ కమీషనర్ డిఎస్ చౌహాన్ ధాన్యం కొనుగోలుపై జిల్లాకలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించగా ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి, అదనపు కలెక్టర్ రెవిన్యూ మోహన్ రావు తో కలిసి కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి పాల్గొన్నారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో యాసంగి పంట 202425 సంవత్సరంలో 54 లక్షల 89 వేల ఎకరాలలో సాగు జరిగిందని, 137.10 ఎల్ఎంటి ధాన్యం ఉత్పత్తి అవుతుందని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా దాదాపు 70.13 ఎల్ఎంటి ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంటుందని అన్నారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 2.55 లక్షల రైతుల నుంచి 19.60 ఎల్.ఎం.టి. ధాన్యం కొనుగోలు చేశామని అన్నారు. మే నెలలో కొనుగోలు కేంద్రాలకు అధికంగా ధాన్యం రానున్న నేపథ్యంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. అకాల వర్షాలు కారణంగా రైతులు నష్టపోకుండా నాణ్యమైన ధాన్యాన్ని వేగవంతంగా కొనుగోలు చేయాలని మంత్రి సూచించారు. రానున్న 15 నుంచి 20 రోజుల పాటు సజావుగా ధాన్యం కొనుగోలు చేయడం ప్రభుత్వ అత్యంత ప్రాధాన్యత అంశమని అన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద ఎటువంటి లోటుపాట్లు ఉండటానికి వీలులేదని అన్నారు. రైస్ మిల్లులకు బ్యాంక్ గ్యారెంటీ అడిగామని, ఏ అంశంలో మినహాయింపులు ఇవ్వడం కుదరదని మంత్రి పేర్కొన్నారు. రైస్ మిల్లర్లతో కలెక్టర్, ఉన్నతాధికారులు చర్చించాలని, జిల్లాలలో అవసరమైతే ఇంటర్మీడియట్ గోదాములకు కొనుగోలు చేసిన ధాన్యాన్ని తరలించాలని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 10 లక్షల మెట్రిక్ టన్నుల ఇంటర్మీడియట్ గోదాముల కేటాయింపు జిల్లాల వారీగా అవసరం బట్టి మంజూరు చేయాలని మంత్రి పౌర సరఫరాల శాఖ ఉన్నతాధికారులకు సూచించారు. ప్రభుత్వానికి ఆర్థికంగా ఇబ్బంది ఉన్నప్పటికీ రైతులకు సమస్య రాకుండా చూసుకోవాలని అన్నారు. ధాన్యం కొనుగోలుపై వివిధ రాజకీయ పక్షాలు, పత్రికలు, సామాజిక మాధ్యమాల ద్వారా చేస్తున్న దుష్ప్రచారాన్ని అధికారులు తిప్పి కొట్టాలని, ఎక్కడైనా నిజంగానే ఇబ్బందులు ఉంటే వాటిని సత్వరమే పరిష్కరించాలని మంత్రి సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు మాట్లాడుతూ, హెచ్ఎంటి, ఆర్ఎన్ఆర్, 1638 రకాల ధాన్యంలో నూకలు అధికంగా వస్తాయనే కారణంతో మిల్లర్లు -మిగతా3లో..

# స్వప్నం భగ్నమైంది...

- చితిగిపోయిన జీవితాలు.. ఆరని క్షితిమంటలు..
- అనుకోని సంఘటన.. అంతు పట్టని ప్రశ్నలు ఎన్నో..?
- రోడ్డు సేఫ్టీ నియమాలు, ప్రమాద నివారణ ప్రమాణాలు పాటించని అధికారులదా...?
- చదువుకుందామని వస్తే చావే ఎదురైంది..
- క్షణ కాలంలో అనుకోని సంఘటనలు.. మిన్నంటిన రోదనలు..
- ప్రమాదానికి కారకులైన వారిని శిక్షించాలి..
- విద్యార్థుల కుటుంబాలకు న్యాయం చేయాలి ..



విద్యార్థిని మహేశ్వరి, మనిషా శ్రీ లకు నివాళ్లు అర్పిస్తున్న దృశ్యం

**గద్వాల టౌన్, ఏప్రిల్ 30 ప్రభాతవార్త :** ఎక్కడో పుట్టి.. ఎక్కడో పెరిగి... ఇక్కడే కలిశాం... అనుకోవాల్సిన సమయాన... ఇక్కడే కడచేరాం అనుకోవాల్సి వస్తుందని ఎవరూ ఊహించని విధంగా గత మంగళవారం పట్టణంలోని కొత్త హౌసింగ్ బోర్డుకు వెళ్లే చౌరస్తా దగ్గర జరిగిన ఘోర రోడ్డు ప్రమాదానికి రెండు నిండు ప్రాణాలు బలి అయ్యాయి. గద్వాల పట్టణంలో నర్సింగ్ కాలేజీలో చదువు కుంటున్న విద్యార్థినిలు నారాయణపేట జిల్లా మాగనూరు మండలము గురురావు లింగంపల్లి గ్రామానికి చెందిన మహేశ్వరి (20), వనపర్తి జిల్లాకు చెందిన మనీషా శ్రీ (20), ఇద్దరు ఈ ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఐదుగురికి తీవ్ర గాయాలు అయ్యాయి. మృతిచెందిన విద్యార్థుల గ్రామాలలో విషాద ఛాయలు నెలకొన్నాయి. భవిష్యత్తులో ఎంతో ఎత్తుకు ఎదగాల్సిన ముక్కుపచ్చలారని బాల్య జీవితాలు చిదిగిపోవడానికి కారణం ఎవరూ, తప్పు ఎవరిది అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. విద్యార్థి దశలో వారు ఎన్నో చవిచూసి అనుకున్నది సాధించి, కష్టపడి ఎంతో ఎత్తుకు ఎదగాలని ఆశతో, ఆశయంతో ఎక్కడి నుండో వచ్చి గద్వాలలో నర్సింగ్ కాలేజీలో చదువుతూ వారి కలలను సాకారం చేసుకుంటున్న తరుణంలో మృత్యువు వెంటాడింది. మా కూతుళ్లు క్షేమంగా చదువుకుంటున్నారని నమ్మకంతో వారిపై ఎన్నో ఆశలు పెట్టుకునీ వారికోసం ఎదురు చూస్తున్న తల్లి తల్లిదండ్రులకు చావు కబురు వినగానే ఎలా అయ్యుంటారో ఒక్కసారి ఆలోచించండి. ఆలోచనా చేయడానికి మనకే ధైర్యం చాలడం లేదుకదా మరి ప్రాణం పోసిన వారి పరిస్థితి ఎలా ఉంటుంది. ఎవరో చేసిన నిర్లక్ష్యానికి విద్యార్థుల ప్రాణాలు కోల్పోయారే అయ్యో రామ చదువు కుందామని వస్తె చావే ఎదురైంది అంటూ జనం తల్లడిల్లారు. వారి జీవితాభ్యూ దయానికి దేవుడు కరుణించ లేదు క్షణ కాలంలో కనిపించని లోకాలకు వెళ్ళిపోయారు. వారి స్వప్నం భగ్నమైంది వారే మా జీవితం అని నమ్ముకుని వున్న తల్లీదండ్రుల ఆశలు అడియాశలు అయ్యాయి. ప్రమాద స్థలంలో క్షతగాత్రులను చూశాక వారి తోటివిద్యార్తులు,ప్రజలు కన్నీరు మున్నీరు అయ్యారు. -మిగతా4లో..



ఆవేదన వ్యక్తం చేస్తూ కన్నీరు పెడుతున్న విద్యార్థులు

# భూ భారతితోనే భూ వివాదాల పరిష్కారం





భూభారతి అవగాహన సదస్సులో ప్రసంగిస్తున్న మంత్రి జూపల్లి , అవగాహన సదస్సులో పాల్గొన్న రైతులు

**భూ సమస్యలను అధికారులు వేగంగా పరిష్కరించాలి**

**ధరణిలో భూ వివాదలపై అప్పీల్ చేసుకోవచ్చు.!**

**గత సాదాబైనమా, వారసత్వ హక్కులపైన మరోసారి పరిశీలన**

**ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు,**

**జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్**

**కొల్లాపూర్ ఏప్రిల్ 30 ప్రభాతవార్త :** నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజక వర్గం కోడేరు మండల కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంస్థ గోడౌన్‌లో, కొల్లాపూర్ పట్టణంలోని వాసవి కళ్యాణ మండపంలో నిర్వహించిన భూభారతి చట్టం అవగాహన సదస్సులో రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక,సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణా రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ ధరణి ద్వారా పరిష్కారం కాని భూ సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం భూ భారతి అర్ఓఅర్ చట్టం 2025 ఏప్రిల్ 14 న అంబేద్కర్ జయంతి రోజున అమలులోకి ప్రభుత్వం తీసుకొచ్చిందని ఆయన అన్నారు. భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి భూ భారతి చట్టం ఎంతగానో ఉపయోగపడుతుందని, రైతులకు తమ భూముల విషయంలో ఎలాంటి అపోహలకు తావివ్వకుండా జవాబుదారితనాన్ని పెంచేందుకు భూ భారతి చట్టం చేపట్టడం జరిగిందని తెలిపారు. ధరణిలో ప్రజల భూ సమస్యలు పరిష్కారం కాలేదని, ప్రజా ప్రభుత్వం భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు భూభారతి చట్టం2025 తీసుకురావడం జరిగిందన్నారు. కొత్త చట్టం ద్వారా లావాదేవీల సేవలు, రిజిస్ట్రేషన్, మ్యూటేషన్, నిషేధిత భూములు, ఆర్ ఓ ఆర్ మార్పులు చేర్పులు వంటి సేవలు సులభతరం అవుతుందని మంత్రి తెలిపారు. ధరణితో ఎంతో ఇబ్బందికరంగా ఉండేదని ఇలాంటి లోటు పాట్లను గుర్తించిన ప్రభుత్వం ప్రజలకు సరళంగా ఉండే విధంగా భూ భారతి చట్టాన్ని రూపొందించిందని మంత్రి తెలిపారు. ధరణి చట్టం కారణంగా నెలల తరబడి రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగేదని, వివరించారు . భూభారతి చట్టం అమలులోకి రాకముందు ఎన్నో రకాల భూ సమస్యలతో రైతులు,సామాన్య ప్రజలు ఇబ్బంది ఎదురుకొన్నారని తెలిపారు. భూమి హక్కు అనేది గౌరవం,ఆత్మ విశ్వాసం, ధైర్యం అని అన్నారు. భూమి కొనుగోలు చేసిన పట్టాదారు రికార్డు లో నమోదు కాక పోవడం కారణంగా రైతుకు రైతుబంధు,రైతు భరోసా రాలేదని తెలిపారు. సాగు చేసుకునే రైతు పేరు కాకుండా ధరణిలో ఉన్న వారే యజమానులుగా వ్యవహరిస్తున్నారు. దాన్ని ఆసరా చేసుకుని తిరిగి రిజిస్ట్రేషన్ చేయాలంటే మళ్ళీ డబ్బులు డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. భూ సమస్యలు ఇప్పటికీ పరిష్కారం కాక ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ తిరుగుతున్నారని అన్నారు. భూ రికార్డులను సవరణ చేసేందుకు అధికారులకు ధరణి చట్టంలో అధికారం లేదని అన్నారు . ధరణి ద్వారా నష్టపోయిన రైతులకు న్యాయం చేసేందుకు భూభారతి చట్టాన్ని అమలులోకి తీసుకు వచ్చినట్లు తెలిపారు. పాస్ పుస్తకాల్లో సవరణలు నిర్దేశిత సమయంలోగా పరిష్కరించడం జరుగుతుందని అన్నారు. గతంలో ఇచ్చిన దరఖాస్తులను,సాధా బైనామా దరఖాస్తులను భూ భారతి చట్టం ద్వారా పరిష్కరిం పడతాయని తెలిపారు. నియోజక వర్గంలోని రైతులు తమ భూసమస్యల దరఖాస్తులను తహసిల్దార్ కార్యాలయాలలో సమర్పించిన అనంతరం రసీదులు పొంది తన యొక్క వాట్సాప్ నెంబర్‌కు పంపాలని, ప్రతి రోజూ వచ్చిన దరఖాస్తులను ప్రింట్ తీసుకొని అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ప్రజలకు మంత్రి తెలియజేశారు. భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలందరినీ గౌరవిస్తూ రెవెన్యూ అధికారులు వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన భూ భారతి చట్టంతో భూ వివాదాలు శాశ్వత పరిష్కారం అవుతాయని కలెక్టర్ అన్నారు. ధరణితో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దూరం చేయాలన్న కృత నిశ్చయంతో నిపుణులచే 17 రాష్ట్రాలలో అధ్యయనం జరిపించిన మీదట - మిగతా3లో..

## వైభవంగా లలిత త్రిపుర సుందరి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం

**ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఆదిత్య పరాశ్రి గురువు, సిద్ధి లింగ గురువు**



అమ్మవారి విగ్రహ ప్రతిష్ట పాల్గొన్న గురువులు

**పెబ్బేరు,ఏప్రిల్ 30 ప్రభాతవార్త :** పెబ్బేరు పట్టణ కేంద్రంలోని శ్రీధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి దేవాల యంలో శ్రీ లలితా త్రిపుర సుందరి దేవి అమ్మవారి ప్రతిష్ట కార్యక్రమం మహోత్సవానికి అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈప్రతిష్ట మహోత్సవానికి ముఖ్య అతిథులుగా శ్రీశ్రీ అంబాత్రయ క్షేత్ర వ్యవస్థాపకులు ఆధ్యాత్మిక పరిశోధకులు డాక్టర్ శ్రీశ్రీశ్రీ ఆదిత్యపరాశ్రీ గురువు, శ్రీ మనిప్ర పంచమ "సిద్ధి లింగ" పశ్చిమాద్రి సంస్థాన విరక్తమఠం పీఠాధిశులు బుధవారం ఉదయం 7 గంటలకు సుంకులమ్మ దేవాలయం వద్ద ప్రత్యేక పూజలు చేసే అక్కడి నుంచి శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి దేవాలయం వరకు బైక్ ర్యాలీతో ఆలయానికి చేరుకొని, లలితా త్రిపుర సుందరి దేవి అమ్మవారి యంత్ర ప్రతిష్ట, నవగ్రహాల యంత్ర ప్రతిష్ట, కమ్యూనిటీ హాల్ ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో హిందూ జాగృతం సభ్యులు, శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి దేవాలయ కమిటీ సభ్యులు, పట్టణ ప్రముఖులు, యువకులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పదవ తరగతి ఫలితాల్లో కేజీబీవీ విద్యార్థుల ప్రతిభ

**ఖిల్లాఘణపురం, ఏప్రిల్ 30 ప్రభాతవార్త :** మండలంలో పదవ తరగతి ఫలితాల్లో 94.35 శాతం ఉత్తీర్ణత సాధించారని మండల విద్యాధికారి జయశంకర్ తెలిపారు. మండలంలోని 10 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని 441 మంది విద్యార్థులు పరీక్షలు హాజరుకాగా 418 మంది విద్యార్థులు సాధించడం తోపాటు 94.35 శాతం ఫలితాలు సాధించినట్లు ఆయన తెలిపారు. మండల కేంద్రంలోని కేజీబీవీ జనరల్ పాఠశాల విద్యార్థిని ఎం.ప్రసన్న 544 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచిందని మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ బాలికలు విద్యార్థిని అనురాధ 542 మార్కులతో మండల టాపర్గా రెండవ స్థానంలో నిలిచిందన్నారు. మండల కేంద్రానికి చెందిన కేజీబీవీ ఇంగ్లీష్ మీడియం అప్పారెడ్డిపల్లి జెడ్పిహెచ్ఎస్ పాఠశాలలో పదవ తరగతి పరీక్షల్లో 100 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారన్నారు. కేజీబీవీ జనరల్ పాఠశాలలో 33 మంది విద్యార్థులు 10 పరీక్షలు రాయగా 32 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించడంతో పాటు పదిమంది విద్యార్థులకు 500 పైగా మార్కులు సాధించినట్లు పాఠశాల ఎస్ఓ ప్రశాంతి తెలిపారు 10 పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను ఉపాధ్యాయులు తల్లిదండ్రులు అభినందించారు

## కళ్యాణ మండపాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



కళ్యాణ మండపాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

**గద్వాల, ఏప్రిల్ 30 ప్రభాతవార్త :** బుధవారం గద్వాల నియోజకవర్గం కె.టి దొడ్డి మండల పరిధిలోని పాగుంట వెంకటాపురం లోని శ్రీశ్రీశ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి దేవాలయం నందు నూతన కళ్యాణ మండపాన్ని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ప్రారంభించారు. వేద పండితులు, ఈఓ ఎమ్మెల్యే కి స్వాగతం పలికారు. ముందుగా శ్రీశ్రీశ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి వారి దేవాలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారి ఆశీస్సులను పొందారు. నూతన కళ్యాణ మండపంను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ కురువ హనుమంతు, మాజీ ఎంపీపీ విజయ్, మాజీ వైస్ ఎంపీపీ రామకృష్ణ నాయుడు, నాయకులు ఉరుకుందు, మైల గడ్డ శేఖర్, రాజేష్, ఆంజనేయులు, చంద్రశేఖర్, వెంకన్న గౌడ్, హరి ప్రసాద్ గౌడ్, అమరేష్, శేఖర్ రెడ్డి, టిచర్ గోవిందు, ఆంజనేయులు, గోపి, యూత్ అధ్యక్షుడు మల్లేష్ గౌడ్, యువ వీరేష్, కాసీం, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులకే ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలి

**అమరచింత, ఏప్రిల్ 30 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్లను అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని బిజెపి మండల అధ్యక్షురాలు, మంగ లావణ్య, బిజెపి సీనియర్ నాయకులు దుబాయి వెంకటేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం అమరచింత మున్సిపల్ కేంద్రంలోని తొమ్మిదో వార్డులో బిజెపి పార్టీ ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలలో అర్హులైన వారికి ఇందిరమ్మ ఇల్లు ఇస్తామని వాగ్దానం చేసిన ఇప్పుడు ప్రతి వార్డుకు 10 ఇండ్లు ఇవ్వడం సరైన పద్ధతి కాదని వారు అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం అమరచింత మున్సిపాలిటీకి 500 ఇండ్లు కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. అలాగే కేంద్ర ప్రభుత్వం పేదల కోసం ప్రధానమంత్రి ఆవాజ్ పథకం ద్వారా ఇండ్లు మంజూరు చేస్తుందని వారు అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రధానమంత్రి ఆవాజ్ పథకం ద్వారా ఇండ్లు మంజూరు చేయిస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మెగా వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి



వైద్య శిబిరానికి సంబంధించిన కరపత్రం ఆవిష్కరిస్తున్న దృశ్యం

**నారాయణపేట టౌన్,ఏప్రిల్ 30 ప్రభాతవార్త :**జిల్లా కేంద్రంలోని నిత్య హాస్పిటల్‌లో నేటి నుండి మూడు రోజులపాటు నిర్వహించబోయే చిన్నపిల్లల ఉచిత మెఘ శిబిరాన్ని జిల్లా ప్రజల సద్వినియోగం చేసుకోవాలని లయన్స్ క్లబ్ పాస్ట్ గవర్నర్ డా. హరి నారాయణ్ భట్టడ్, నిత్య హాస్పిటల్ వైద్య నిపుణులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని నిత్యా హాస్పిటల్‌లో 3 రోజుల పాటు ప్రతి రోజు ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గం.లవరకు చిన్న పిల్లల వైద్య నిపుణురాలు సునిది గండె పర్యవేక్షణలో మెరుగైన చికిత్సతోపాటు ఉచితంగా మందులు పంపిణి చేస్తారని అన్నారు. అనంతరం నిత్యా హాస్పిటల్‌లో నిర్వహించబోయే ఉచిత వైద్య శిబిరానికి సంబందించిన కరపత్రం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ జనరల్ ఫిజిషియన్ కార్తీక్ కుమార్, గందె జనార్ధన్, బాలాజీ, రవిగౌడ్, మోహన్‌తో బాటు తదితరులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాలతో అనర్థాలు : ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డా. వాకిటి శ్రీహరి

**మక్తల్, ఏప్రిల్ 30 ప్రభాతవార్త:** చదు వుకునే వయసులో బాలికలకు వివా హాలు చేయడం వల్ల అనర్థాలకు దారి తీసి వారి భవిష్యత్తు అంధకారంగా మారుతుందని మక్తల్ ఎమ్మెల్యే డా. వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. మక్తల్ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద బు ధవారం బాల్య వివాహాలపై ప్రజలకు అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లా డుతూ.. అమ్మాయిలకు 18 ఏళ్ళు, అ బ్బాయిలకు 21 ఏళ్లు నిండిన వారికి మాత్రమే వివాహాలను చేయాలన్నారు నేటి పోటీ ప్రపంచంలో ఉన్నత చదువులు చదివితేనే జీవితంలో రాణించగలుగుతారని, దీన్ని దృష్టిలో ఉంచుకొని బాలికలను ఉన్నత చదువులు చదివించాలని ఆయన అన్నారు. బాల్య వివాహాలను చేసిన, ప్రోత్సహించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గణేష్ కుమార్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు రవికుమార్, డీటి పుష్పలత, ఐసిడిఎస్ సిడిపిఓ సరోజి నీ, బాలల సంరక్షణ అధికారులు కవిత, విద్య, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## భీమ్ రాజ్ కుటుంబానికి అండగా ఉంటాం

**పియూ అకాడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్**

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఏప్రిల్ 30 ప్రభాతవార్త:** పీయూ పరిధిలోని కొల్లాపూర్ పీజీ సెంటర్లో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న భీమ్‌రాజ్ మంగళవారం సాయంత్రం అనారోగ్య కారణాలతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న వీసీ ఆచార జీఎం శ్రీనివాస్, రిజిస్టర్ ఆచార్యపూస రమేష్‌బాబు వారి కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని తక్షణ సాయం కింద అంత్యక్రియలకు అవసరమగు ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం చేశారు. బోధనేతర సంఘం ఆధ్వర్యంలో యూనివర్సిటీ ప్రధాన ముఖద్వారం దగ్గర భీమ్‌రాజ్ చిత్రపటానికి అకాడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ డా.చంద్ర కిరణ్, వైస్ ప్రిన్సిపాల్ డా. కృష్ణయ్యతో కలిసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న వయసులో బీమ్‌రాజు అకాల మరణం చెందడం బాధాకరమని, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నారని, వారి కుటుంబ సభ్యులకు అండగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, అసిస్టెంట్ రిజిస్ట్రార్ వెంకటేశ్వర్లు, సూపరిండెంట్ రవీందర్, బోధనేతర సంఘం అధ్యక్షుడు రామ్మోహన్ జి.ఉపాధ్యక్షులు పర్వతాలు, కార్యవర్గ సభ్యులు సూర్య సంతోష్ శంకర్ పాల్గొన్నారు.

# అణగారిన వర్గాలకు అంబేద్కర్ శ్రీరామరక్ష : ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి



అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

**ఆత్మకూరు, ఏప్రిల్ 30 ప్రభాతవార్త :** దేశంలోని అట్టడుగు అన్నగారిన వర్గాలకు అంబేద్కర్ రాసిన రాజ్యాంగం శ్రీరామరక్షగా మారిందని మఖ్తల్ నియోజకవర్గం శాసనసభ్యులు వాకిటి శ్రీహరి అన్నారు. బుధవారం ఆత్మకూరు మండలంలోని తూంపల్లి గ్రామంలో అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ప్రస్తుతం అణగారిన వర్గాలు రాజకీయ పదవులు కానీ లేదా ప్రభుత్వ స్థాయిలో ఉన్నత పదవులు పొందుతున్నారంటే అందుకు కారణం అంబేద్కర్ రాసిన రాజ్యాంగమే ప్రధాన కారణమని ఎమ్మెల్యే అన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం అంబేద్కర్ ఆశయాలను కొనసాగించే విధంగా పేదలకు సంక్షేమ పథకాలను అందజేస్తుందని అందులో భాగంగానే ఇందిరమ్మ ఇండ్లను, రైతులను రాజులుగా మార్చేందుకు తమ ప్రభుత్వం కృతనిశ్చయంతో పని చేస్తుందని ఆయన అన్నారు. ప్రస్తుతం దేశంలోని ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ కులగరణ చేయాలంటూ గత కొన్ని రోజులుగా విజ్ఞప్తి చేస్తున్నప్పటికీ నరేంద్ర మోడీ ప్రభుత్వం మాత్రం అనగారిన వర్గాలకు మేలు జరుగుతుందని అక్కస్సుతో కులగరణ చేయకుండా దాస్తారం చేస్తున్నారని ఆయన తీవ్రస్థాయిలో ఆరోపించారు. ఇప్పటికైనా దేశంలో తెలంగాణ ప్రభుత్వం చేసిన మాదిరిగా కులగల చేపట్టి అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని అమలు చేయాలని లేని పక్షంలో భవిష్యత్తులో పాలకులకు పుట్టగతులు లేకుండా పోతాయని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తుంపల్లి గ్రామం మాజీ సర్పంచ్ లక్ష్మీకాంత్ రెడ్డి అధ్యక్షుడు ఆరేపల్లి లక్ష్మీకాంత్ రెడ్డి అఖిలపక్ష నాయకులు గాయత్రి రవికుమార్ యాదవ్, ఆత్మకూరు సింగిల్ విండో అధ్యక్షుడు గాడి కృష్ణమూర్తి, ఆత్మకూరు మాజీ జెడ్పిటిసి సభ్యులు బాలకృష్ణ ,కాంగ్రెస్ పార్టీ నాయకులు తులసిరాజు యాదవ్, నల్లగొండ శ్రీనివాసులు ,రహమతుల్లా ,పరమేష్ తదితరులతో పాటుగా పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## భక్తి ద్వారానే ముక్తి లభిస్తుంది

**దేవాలయ ముఖద్వారాన్ని ప్రారంభించిన ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**



ముఖ ద్వారాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, ఎంపీ

**వెల్దండ,ఏప్రిల్30 ప్రభాతవార్త:**దక్షిణ కాశీగా ప్రసిద్ధి గాంచిన గుండాల అంబ రామలింగేశ్వర స్వామి దేవాలయ ముఖద్వారాన్ని వెల్దండ మండల కేంద్రంలోని జాతీయ రహదారి పక్కన బొల్లంపల్లి గ్రామానికి చెందిన సిలివేరు రామస్వామి గౌడ్ దాదాపు రూ.40 లక్షలు తన సొంతంగా వెచ్చించి ముఖద్వారాన్ని నిర్మించారు. బుధవారం పదార ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, ఎంపీ మల్లు రవిల చేతుల మీదుగా ప్రత్యేక పూజలు నిర్వహించి ముఖద్వారాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, ఎంపీ మల్లురవి మాట్లాడుతూ మనం సంపాదించిన దానిలో కొంత డబ్బు అయిన సమాజ సేవకు భక్తి మార్గానికి ఖర్చుపెట్టినట్లయితే లభిస్తుందని, కొన్ని తరాలు నిలబడే విధంగా ముఖద్వారానే నిర్మించిన దాత రామస్వామి గౌడ్ దంపతులను అభినందించారు. ఇటువంటి కార్యక్రమాల ద్వారానే మంచి గుర్తింపు లభిస్తుందని, దేవాలయ ముఖ ద్వారాన్ని నిర్మించి కొత్త శోభను తీసుకువచ్చారని డబ్బులతో పాటు ఒక సంవత్సరం పాటు సమయాన్ని వెచ్చించి ముఖ ద్వారంపై శివపార్వతులు, సీతారాములు పోతులూరి వీర బ్రహ్మంగారు లక్ష్మీనరసింహస్వామి, గరుడ వాహన మూర్తులను చూడ ముచ్చటగా ఎంతో భక్తి భావంతో నిర్మించడం ఎంతో అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మెంబర్ ఠాగూర్ బాలాజీసింగ్,మాజీసర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి,ఆర్య వైశ్యమహా సభ జిల్లా అధ్యక్షులు బచ్చు రామకృష్ణ, మార్కెట్‌కమిటీచైర్మన్ ఉమా మనీలా సజీవ్ యాదవ్, తహసీల్దార్ కార్తీక్‌కుమార్,మాజీసర్పంచ్ వెంకటమ్మ, నాయకులు విజయ్‌కుమార్‌రెడ్డి, మోతిలాల్‌నాయక్, పర్వత్‌రెడ్డి, మట్ట వెంకయ్యగౌడ్, శ్రీనివాస్ గౌడ్, శేఖర్, దేవాలయ చైర్మన్ సందీప్ రెడ్డి, వెంకట్‌రెడ్డి, అలీ, నారాయణనాయక్, శ్రీనివాస్, పుల్లయ్య, కేశమల్ల కృష్ణ, ఎర్ర శ్రీను ముదిరాజ్, రమేష్, శివరాజ్‌తో పాటు తదితరులు ఉన్నారు.

## అంకితభావంతో అధికారులు పనిచేసి ప్రజల మన్ననలు పొందాలి

**కమాండెంట్ సాంబయ్యను సన్మానించిన జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు**



ఘనంగా సన్మానించిన అసిస్టెంట్ కమాండెంట్లు

**ఇటిక్యాల, ఏప్రిల్ 30 ప్రభాతవార్త :** ప్రభుత్వ శాఖల్లో విధినిర్వహణలో భాగంగా అంకితభావంతో అధికారులు పనిచేసి ప్రజల మన్ననలు పొందాలని అలా ఉన్నప్పుడే ప్రజలు మన సేవలను గుర్తించుకుంటారని జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. మండల పరిధిలోని ఎర్రవల్లి చౌరస్తాలో గల పదవ బెటాలియన్‌లో కమాండెంట్‌గా పనిచేస్తున్న ఎన్‌వి సాంబయ్య నేడు పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా తెలంగాణ స్పెషల్ పోలీస్ విభాగములో పదవ బెటాలియన్ కమాండెంట్ గా పదవీ బాధ్యతలు నిర్వహిస్తున్న ఎన్ వి సాంబయ్య బుధవారం పదవీ విరమణ పొందిన సందర్భంగా బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ జయరాజు పదవి విరమణ పొందిన కమాండెంట్ ఎన్‌వి సాంబయ్యని శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గద్వాల జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు హాజరై కమాండెంట్ ని శాలువాతో ఘనంగా సత్కరించారు. పదవి విరమణ పొందిన పదవ బెటాలియన్ కమాండెంట్ ఎన్ వి సాంబయ్య పోలీస్ శాఖలో 1984 లో చేరి ఏపీఎస్పీ విభాగంలో రిజర్వ్ సబ్ ఇన్స్పెక్టర్గా బాధ్యతలు చేపట్టారు. అలాగే ఎన్నో కఠినమైన ప్రదేశాలలో యాంటీ నక్సల్స్ విధుల లో విధులు నిర్వహిస్తూ అలాగే చాలామంది ముఖ్యమంత్రుల వద్ద పనిచేస్తూ భద్రత విధులను నిర్వహించారు. ప్రస్తుతం పదవ బెటాలి యన్ కమాండెంట్‌గా బాధ్యతలు నిర్వహిస్తూ బుధవారం పదవి విరమణ పొందగా బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్లు రిజర్వు ఇన్స్పెక్ట ర్లు. సిబ్బంది ఎన్.వి సాంబయ్య ఆయన సతీమణిని కలిసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రిటైర్డ్ కమాండెంట్స్ వేణుగోపాల్, అడిషనల్ కమాండెంట్ జయరాజు, అసిస్టెంట్ కమాండెంట్లు నరేందర్‌రెడ్డి, పాణి రిజర్వ్ సబ్ ఇన్స్పెక్టర్లు రాజు, రాజారావు, రమేష్ బాబు, శ్రీధర్, ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## పౌరులు తమ హక్కులను వినియోగించుకోవాలి

**నవాబుపేట, ఏప్రిల్ 30 ప్రభాతవార్త :** సమాజంలోని పౌరులందరూ తమ హక్కులను వినియోగించుకోవాలని మండల అధికారులు తహసిల్దార్ శ్రీనివాస్ ఎస్సై విక్రం అన్నారు. మండలంలోని కేశవరావు పల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం పౌరహక్కుల దినోత్సవం (సివిల్ రైట్స్ డే) సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రతి పౌరుడు తమ హక్కులను వినియోగించుకోవడంతో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులపై అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ సూచించారు. నిమ్న జాతుల వారిని కించపరిస్తే చట్టప్రకారం శిక్ష పడుతుందన్నారు. ప్రతి నెలాఖరులో గ్రామాల్లో సివిల్స్ రైట్స్ డే కార్యక్రమాలు నిర్వహిస్తామని అధికారులు సూచించారు. సదస్సులో మండల తహసీల్దార్ శ్రీనివాస్ ఆర్ఐ కిరణ్ కుమార్ పోలీస్ అధికారి ఎస్సై విక్రం గ్రామ నాయకులు ప్రజలు పాల్గొన్నారు.

**హైదరాబాద్ నుంచి మొల్గర మీదుగా ఉప్పునుంతలకు**

## బస్సు నడపాలని అర్‌టిసి ఎండికి ఫిర్యాదు

**ఉప్పునుంతల, ఏప్రిల్ 30 ప్రభాతవార్త:** గత మూడు సంవత్సరాల నుంచి కల్వకుర్తి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ప్రతి నిత్యం సాయంత్రం హైదరాబాద్ నుంచి నేరుగా ఉప్పునుంతల కు నడిపించే వారు. గత వారం రోజుల నుంచి బస్సు రద్దు చేయడం పట్ల వంగూరు, ఉప్పునుంతల మండలాల కు చెందిన ప్రజలు, నాయకులు ఆర్టీసీ ఎండి సజ్జనర్‌కు టెలిగ్రామ్ ద్వారా ఫిర్యాదు చేశారు. హైదరాబాద్ నుంచి సాయంత్రం బయలుదేరి ఉప్పునుంతలకు రాత్రి 8.30 గంటలకు కల్వకుర్తి మండలం ఎల్లికల్ మీదుగా వంగూర్ మండలం రంగపూర్,కోనపూర్, ఉల్పర, మిట్ట సదగోడు, ఉప్పునుంతల మండలం మొల్గర, సదగోడు మీదుగా ఉప్పునుంతల లో రాత్రి బస చేసి మరుసటి రోజు వేకువజామున 5 గంటలకు నేరుగా హైదరాబాద్ వెళ్ళేది. దీంతో ఉదయం పూట కల్వకుర్తి డిపోకు బస్సు ఎంతో నమ్మకంతో వస్తుందని ప్రయాణికులు అవగాహనకు వచ్చారు. కల్వకుర్తి డిపో బస్సు తప్పనిసరిగా వస్తుందని ఈ ప్రాంత వాసులు కాకుండా సమీప గ్రామాల ప్రజలు ఎంతో నమ్మకం ఉండేది. అకస్మాత్తుగా బస్సును రద్దు చేయడంతో రాత్రి వేళలో చాలా మంది హైదరాబాద్, కల్వకుర్తి నుంచి వచ్చేవారు ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. స్థానిక ఆర్టీసీ అధికారుల పట్ల విశ్వాసం కోల్పోయి ఆర్టీసీ ఎండి సజ్జనర్ దృష్టికి తీసుకెళ్లారు. కల్వకుర్తి డిపో అధికారులు సమయపాలన పాటిస్తారని, హైదరాబాద్ నుంచి ఉప్పునుంతల వరకు వచ్చిపోయే ప్రయాణికులకు ఎంతో మెరుగైన రవాణా సౌకర్యం కల్పించారని భావించిన ఈ ప్రాంత వాసులకు ఆర్టీసీ బస్సును అర్ధాంతరంగా రద్దు చేయడం పట్ల వారి పట్ల విశ్వాసం కోల్పోయారు. అచ్చంపేట డిపో వారు ఎప్పుడు నడిపిస్తారో, ఎప్పుడు రద్దు చేస్తారో తెలియదు కానీ కల్వకుర్తి డిపో అధికారులు మాత్రం సమయపాలన పాటిస్తారని ఈ ప్రాంత వాసులకు అపార నమ్మకం. కానీ ఆర్టీసీ అధికారులు అర్ధాంతరంగా బస్ సర్వీసును రద్దు చేయడంతో ఈ ప్రాంత వాసులు ఆ నమ్మకాన్ని కోల్పోయారు. హైదరాబాద్ నుంచి కల్వకుర్తికి వచ్చి తమ గ్రామానికి కల్వకుర్తి డిపో బస్సు వస్తుందని నిత్యం ఎదురు చూడవలసిన పరిస్థితి నెలకొంది. కానీ కల్వకుర్తి అర్‌టిసి డిపో అధికారులు ఉల్పర, మొల్గర మీదుగా ఉప్పునుంతల వరకు నడిపించే బస్సు రద్దు పట్ల ఈ ప్రాంతవాసులు వారి పట్ల అసహనం వ్యక్తం చేస్తూ బుధవారం ఆర్టిసి ఎండి సజ్జనర్ కు ఫిర్యాదు చేసినట్లు ఆయా గ్రామాల ప్రజలు పేర్కొన్నారు. ఇప్పటికైనా కల్వకుర్తి ఆర్టీసీ అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించి కల్వకుర్తి డిపో బస్సు సర్వీసు ను ఉప్పునుంతల వరకు తిరిగి పునః ప్రారంభించాలని ఆయా గ్రామాల ప్రజలు, నాయకులు కోరుతున్నారు.

## 100 శాతం ఉత్తీర్ణత సాధించిన గురుకుల విద్యార్థులు



**ఉప్పునుంతల, ఏప్రిల్ 30 ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉప్పునుంతల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన పరీక్ష కేంద్రం లో 161 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 161 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. అదే విధంగా మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల (బాలికలు) విద్యార్థులు అచ్చంపేట పట్టణంలోని వివిధ పరీక్ష కేంద్రంలో 77 మంది విద్యార్థులు హాజరు కాగా 77 మంది విద్యార్థినులు పాస్ అయినట్లు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ యామిని వివరించారు. ఉప్పునుంతల హైస్కూల్లో జరిగిన పరీక్ష కేంద్రంలో హాజరైన విద్యార్థులలో మండల టాపర్‌గా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని అక్కల నందిని 563 మార్కులు సాధించి మండల టాపర్ గా నిలిచారు. సెకండ్ స్థానంలో మేడి పూరి పూజ 557, పవన్ కుమార్ రెడ్డి 547 మూడో స్థానంలో నిలిచారు. 500 మార్కుల పైబడి సాధించిన వారు 25 మంది విద్యార్థులు సాధించినట్లు కాంప్లెక్స్ హెచ్ఎం జటప్రోలు శ్రీనివాస్ రెడ్డి వివరించారు. ఎంజెపిటి బిసి గురుకుల పాఠశాల టాపర్‌గా తేజశ్రీ ... ఉప్పునుంతల మండలంలోని మహాత్మ జ్యోతిరావు పూలే బాలికల గురుకుల పాఠశాల వెల్టూర్ విద్యార్థినులు అచ్చంపేట పట్టణంలో వివిధ పరీక్ష కేంద్రాలలో హాజరైన 77 మంది విద్యార్థులకు 77 మంది విద్యార్థులు ఉత్తీర్ణత శాతం సాధించినట్లు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ యామిని తెలిపారు. తేజశ్రీ 576 మార్కులు సాధించి టాపర్ గా నిలిచారు. 569 మాకు సాధించిన జ్యోత్స్న రెండో స్థానంలో నిలిచారు. 561 మార్కులు సాధించిన ప్రశాంతి మూడో స్థానంలో నిలిచారు. అదేవిధంగా కంసాని పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు 22 మంది పరీక్షలు రాయగా 22 మంది ఉత్తీర్ణత సాధించారు. కేజీబీవీ ఉప్పునుంతల విద్యార్థినిలు 37 మందికి 37 మంది ఉత్తీర్ణత సాధించారు. పెనిమిళ్ళ 19 మందికి 19 మంది, గుంటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు 15 మందికి 15 మంది ఉత్తీర్ణత సాధించినట్లు విద్యాశాఖ అధికారులు వెల్లడించారు. మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఉత్తీర్ణత శాతం 100 శాతం సాధించడం పట్ల మండలంలోని విద్యావేత్తలు, రాజకీయ నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

## కెటిదొడ్డి మహాత్మా జ్యోతి బాపులే గురుకుల పాఠశాలలో 100 ఉత్తీర్ణత

**కెటిదొడ్డి, ఏప్రిల్ 30 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం పదవ తరగతి ఫలితాలు విడుదల చేసిన ఫలితాలలో జోగులాంబ గద్వాల నియోజకవర్గం ర్యాలంపాడు రిజర్వాయర్ సమీపంలో ఉన్న ఇరిగేషన్ డిపార్ట్మెంట్ క్వార్టర్స్ లో కెటి దొడ్డి మండలానికి సంబంధించిన మహాత్మ జ్యోతి బాపూలే పాఠశాల కు సంబంధించి 78మంది విద్యార్థులు పరీక్షలు వ్రాయగా 78 మంది విద్యార్థులు పాసయ్యి 100ఉత్తీర్ణత సాధించారు. ఎస్ చరణ్ అనే విద్యార్థి" 600" మార్కులకు "574" మా ర్కులు, సెకండ్ ర్యాంక్ చరణ్ కుమార్‌రెడ్డి "600 "మార్కులు కు" 568 "మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ కె. శ్రీనివాసరా వు వైస్ ప్రిన్సిపాల్ బి సుధాకర్, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

## బాల్య వివాహం అడ్డగింత

**మక్తల్, ఏప్రిల్ 30 ప్రభాతవార్త:** మక్తల్ మండలంలోని దాసర్ దొడ్డిలో బుధవారం ఉదయం మైనర్ బాలికకు స్థానిక ఆలయంలో బాల్య వివాహం చేస్తుండగా బాలల సంరక్షణ శాఖ అధికారులు, స్థానిక పోలీసులతో కలిసి అడ్డుకున్నారు. అనంతరం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బాలికను జిల్లా కేంద్రంలోని బాల సదనంకు తరలించారు. కార్యక్రమంలో బాలల సంరక్షణ శాఖ సిబ్బంది విజయ్ కుమార్, విద్య, ఐసిడిఎస్ సూపర్వైజర్ అమ్మక్క, పోలీస్ సిబ్బంది మహేష్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

## దాసర్లపల్లి పిడుగుపాటుకు ఆవు మృతి

**ఉప్పునుంతల, ఏప్రిల్ 30 ప్రభాతవార్త :** మండలంలోని దాసర్లపల్లి గ్రామంలో బుధవారం సాయంత్రం పిడుగుపాటుకు కుందేటి హుస్సేన్‌కు చెందిన ఆవు మృతి చెందింది. ఈదురు గాలులతో కూడిన వర్షం రావడంతో మండలంలోని వెల్టూరు గ్రామంలో ప్రధాన రహదారుల గుండా ఉన్న చెట్లు ఈదురు గాలులకు విరిగి రోడ్డు కు అడ్డంగా పడిపోయాయి.

## పదో తరగతి ఫలితాల్లో బాలికల హవా

**బాలానగర్ ఏప్రిల్ 30 ప్రభాతవార్త :** బాలానగర్ మండలంలోని పాఠశాలలో పదవ తరగతి పరీక్షల్లో బాలికల హవా సాగింది. బాలానగర్ మండల కేంద్రంలోని జనరల్ గురుకుల బాలికల పాఠశాలలో 10వ తరగతి విద్యార్థినిలు అమృత 576/600, స్పందన 571/ 600, నందిని 571/600, జోత్స్న 569/600, మౌనిక 569/600 మార్కులు సాధించారు. వ్యవసాయ కుటుంబ నేపథ్యం ఉన్న విద్యార్థులు మంచి ఫలితాలు సాధించటంతో పాఠశాల ప్రిన్సిపల్ అంజన్ రెడ్డి, అధ్యాపక బృందం సంతోషం వ్యక్తం చేశారు. అదేవిధంగా మండల కేంద్రంలోని బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 55 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 50 మంది విద్యార్థులు ఉత్తీర్ణులు అయ్యారు. కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో 42 మంది విద్యార్థులకు గాను 40 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. సింధు 503/600 మార్కులు సాధించింది. మండలంలోని 10 పాఠశాలలో మొత్తం 528 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవగా, వారిని 477 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు.

## వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే

**రాజాపూర్, ఏప్రిల్ 30 ప్రభాతవార్త :** రాజాపూర్ మండల కేంద్రానికి చెందిన కుమ్మరి వసంత కుమ్మరి సత్యనారాయణల కుమార్తె విజయలక్ష్మి, రమేష్ వివాహ వేడుకలు బుధవారం రాజాపూర్ మండల కేంద్రంలో వైభవంగా జరిగాయి. ఈ వివాహ వేడుకలకు జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుధ్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి వెంట ఏఎంసీ డైరెక్టర్ వనపర్తి రమణ, కాంగ్రెస్ పార్టీ రాజాపూర్ గ్రామ అధ్యక్షులు గోనెల రమేష్, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు వెంకటేశ్వర్ రెడ్డి, వనపర్తి నరహరి, శ్రీధర్ రెడ్డి టేమ్, బిజెపి నాయకులు సంతోష్ తదితరులు ఉన్నారు.

**కళ్యాణ మండప ప్రారంభోత్సవంలో కాంగ్రెస్ పార్టీ**

## గద్వాల నియోజకవర్గ ఇంచార్జీ సరితమ్మ

**కెటిదొడ్డి, ఏప్రిల్ 30 ప్రభాతవార్త :** గద్వాల నియోజకవర్గం కేటి దొడ్డి మండలం పరిధిలోని వెంకటాపురం పాగుంట శ్రీశ్రీ లక్ష్మి వెంకటస్వామి ఆలయంలో కర్ణాటక భక్తుల సహకారంతో నిర్మించిన కళ్యాణ మండపం ప్రారంభోత్సవ కార్యక్రమంలో జెడ్పి మాజీ ఛైర్ పర్సన్, కాంగ్రెస్ పార్టీ గద్వాల నియోజకవర్గ ఇంచార్జి సరితమ్మ పాల్గొని గుమ్మడికాయ కొట్టి ప్రారంభించారు. అంతకుముందు పాగుంట వెంకన్న స్వామి వారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం గ్రామపెద్దలు సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, తిమ్మారెడ్డి, మహానంది రెడ్డి, పద్మారెడ్డి, మాజీ సింగిల్ విండో చైర్మన్ సీసల వెంకట్ రెడ్డి, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఆర్.తిరుమలేష్, కార్యకర్తలు, తదితరులు ఉన్నారు.

## పదిలో ప్రభుత్వ విద్యార్థుల ప్రభంజనం

**నవాబుపేట, ఏప్రిల్ 30 ప్రభాతవార్త :** మహబూబ్నగర్ రూరల్ మండలం పరిధిలోని ఫతేపూర్ జెడ్పిహెచ్ఎస్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు మొత్తం100 విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. విద్యార్థులు అందరూ ఉత్తీర్ణత కావడానికి కృషి చేసిన పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉపా ధ్యాయ బృందాన్ని మరియు అత్యధిక మార్కులు శ్రీలత.499 ముజఫర్ 489 శివశంకర్ 476సాధించిన విద్యార్థులను గ్రామ ప్రజాప్రతినిధులు మాజీ ఎంపిటిసి మాజీ సర్పంచు నాయకులు శాలువాతో సత్కరించారు.

## పదిలో పెబ్బేరు మోడల్ స్కూల్ విద్యార్థులు

**పెబ్బేరు,ఏప్రిల్ 30 ప్రభాతవార్త :** పది ఫలితాలలో పెబ్బేరు మోడల్ స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ తూర్పుంటి నరేష్ మాట్లాడుతూ పదవ తరగతి ఫలితాలలో జానకిరామ్ 546, హుజాఫీయా 541, పూర్ణచంద్ 540, కార్తీక్ 534, మనోజ్ఞ సాగరి 531, సుకన్య 529, అక్షయ 522, కేటి చేతన 522, సౌమ్యశ్రీ 522 మంచి మార్కులు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపల్ అభినందించారు. మోడల్ స్కూల్ మొత్తంలో 96 శాతం ఉత్తీర్ణత సాధించారని ఇలాంటి విజయాలను మరెన్నో సాధించి మోడల్ స్కూల్ కు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు.

## ఎస్.ఎస్.సి.లో ఉత్తమ ఫలితాలు సాధించిన

# అలంపూర్ మాంటిస్సోరి పాఠశాల విద్యార్థులు




**అలంపూర్, ఏప్రిల్ 30 ప్రభాతవార్త :** స్థానిక మాంటిస్సోరి పాఠశాల విద్యార్థులు 2024-25 విద్యా సంవత్సరంలో నిర్వహించిన పదవ తరగతి ఎస్.ఎస్.సి పరీక్షలలో అత్యద్భుతమైన విజయాన్ని సాధించి విద్యా రంగంలో తమ ప్రతిభను చాటారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి.నాగలక్ష్మి ఒక ప్రకటనలో ఈ విషయాన్ని తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో మొత్తం 71 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, వారందరూ ఉత్తీర్ణులై 100 శాతం విజయశాతాన్ని సాధించారు. వీరిలో 70 మంది విద్యార్థులు ప్రథమ శ్రేణి మార్కులతో ఉత్తీర్ణులయ్యారు. ఇందులో కర్నె పూజిత 538 మార్కులు సాధించి పాఠశాల టాపర్‌గా నిలిచింది. పాఠశాల డైరెక్టర్ కె. యన్. వి. రవి ప్రకాశ్ మాట్లాడుతూ, ఈ విజయం ఉపాధ్యాయుల నిబద్ధత, విద్యార్థుల కృషి, తల్లిదండ్రుల సహకార ఫలితమని పేర్కొన్నారు. విద్యార్థుల ప్రతిభను అభినందిస్తూ, వారందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఉపాధ్యాయుల త్యాగం ఫలించిందని, ఈ విజయం పాఠశాల ఖ్యాతిని మరింతగా పెంచిందని అన్నారు. ఈ గొప్ప విజయాన్ని పురస్కరించుకుని, పాఠశాల వర్గాలు విద్యార్థుల భవిష్యత్తు విద్యా ప్రయాణానికి మరింత సహకారం అందించేందుకు కట్టుబడి ఉన్నట్లు తెలియజేశాయి.

# భూ భారతితోనే భూ వివాదాల పరిష్కారం

**మొదటి పేజీ తరువాయి భాగం..**

సమగ్ర అంశాలను పొందుపరుస్తూ రైతు ప్రయోజనాలే ధ్యేయంగా ఆర్ఓఆర్ చట్టాన్ని రూపొందించారని తెలిపారు. ఈ చట్టం గురించి ప్రజలకు అవగాహన కల్పించడానికి ప్రతీ మండల కేంద్రంలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని అన్నారు. ధరణి స్థానంలో కొత్తగా భూభారతి (భూమి హక్కుల చట్టం) తీసుకురావడం జరిగిందని తెలిపారు. ఇందులో అన్ని రకాల అప్లికేషన్స్ ఉన్నాయని, హక్కుల రికార్డులలో తప్పులను సవరణ చేసుకోవచ్చని, రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ చేయడానికి ముందు భూముల సర్వే, పెండింగ్ సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారం జరుగుతుందని సూచించారు. వారసత్వంగా వచ్చిన భూములకు మ్యుటేషన్ చేసే ముందు నిర్ణీత కాలంలో విచారణ, పాసు పుస్తకాలలో భూమి పటం, భూముల సమస్యలు పరిష్కారానికి రెండు అంచెల అప్పీల్ వ్యవస్థ ఉంటుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. తహసీల్దార్ చేసిన మ్యుటేషన్లపై లేదా జారీ చేసిన పాసు పుస్తకాలపై అభ్యంతరాలు ఉంటే ఆర్డీఓ కు అప్పీలు చేసుకోవచ్చని, ఆర్డీఓ ఇచ్చిన తీర్పు పై అభ్యంతరం ఉంటే జిల్లా కలెక్టర్ కు అప్పీలు చేసుకోవచ్చని సూచించారు. కలెక్టర్ ఇచ్చిన తీర్పు పై అభ్యంతరం ఉంటే భూమి ట్రిబ్యునల్ కు కూడా అప్పీలు చేసుకోవచ్చని అన్నారు. అప్పీలు చేసుకున్న పేద రైతులకు ఉచిత న్యాయ సహాయం అందిస్తారని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ తరహా తోడ్పాటు దేశంలోనే మరెక్కడా లేదని అన్నారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా అధికార వికేంద్రీకరణకు ప్రాధాన్యతనిస్తూ తహసీల్దార్, ఆర్డీఓలకు మ్యుటేషన్ చేసే అధికారాలను ప్రభుత్వం కల్పించిందని అన్నారు. భూముల కొనుగోలు, దానం, తనఖా, బదిలీ, భాగ పంపకాలకు సంబంధించి స్లాట్ బుక్ చేసుకుని తహసీల్దార్ కార్యాలయానికి వెళ్తే, అసైన్డ్, పీ.ఓ.టీ, ప్రభుత్వ భూములు కావని నిర్ధారించుకున్న మీదట గడువులోపు రిజిస్ట్రేషన్ చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. వారసత్వ వీలునామా కింద కూడా మ్యుటేషన్ చేసే అధికారాలను తహసీల్దార్లకు కల్పించారని అన్నారు. అయితే క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ జరిపిన మీదట వారసత్వ వీలునామా రిజిస్ట్రేషన్ చేస్తారని సూచించారు. భూ వివాదాల సత్వర పరిష్కారం కోసం భూభారతి ద్వారా ఇదివరకటి తరహాలోనే రెవెన్యూ కోర్టులను పునరుద్ధరించారని తెలిపారు. భూములకు సంబంధించిన సమగ్ర వివరాలు, హద్దులతో పట్టా పాస్ బుక్కులకు మ్యాప్‌లను జత చేస్తారని అన్నారు. లైసెన్స్డ్ సర్వేయర్‌తో సర్వే చేయించి సమర్పించే మ్యాప్‌లను సర్వేయర్ పరిశీలించి, పట్టాపాస్ పుస్తకంలో నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఈ అవగాహన సదస్సుకు, ఆర్డివో, తహసిల్దార్, వ్యవసాయ శాఖ అధికారులు, రెవెన్యూ సిబ్బంది, గ్రామస్తులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# 10 సంవత్సరాలు పాలన అప్పుల ఊబిలోకి..

**మొదటి పేజీ తరువాయి భాగం..**

రూపాయలు ఉంటే నేడు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రూ.10లక్షలను పెంచిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కిందన్నారు. నేడు పేద ప్రజల పిల్లలు మంచిగా చదువుకోవాలని ఇంటిగ్రేటెడ్ స్కూల్‌లను ఏర్పాటు చేసి 4వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పిల్లలకు కార్పొరేట్ స్థాయిలో విద్యను అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ముందుకు సాగుతుందని ఆనందం వ్యక్తం చేశారు. అదేవిధంగా దేశంలో ఏ రాష్ట్రంలో చేయని విధంగా ఏకకాలంలోనే రైతులకు రూ.2లక్షల రూపాయల రుణమాఫీ, రైతు భరోసా, కౌలు రైతులకు సైతం ఆదుకున్న ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని అలాంటి ప్రభుత్వంపై నేడు విమర్శలు చేయడం ప్రతిపక్ష నాయకులకు సరికాదని అన్నారు. తెలంగాణ ప్రజలు విజ్ఞులని ప్రతిదీ గ్రహిస్తున్నారని, బీఆర్ఎస్ నాయకుల మాయమాటలకు ప్రజలు మోసపోరని నేడు కాంగ్రెస్ ప్రభుత్వం పై ప్రజలకు పూర్తి విశ్వాసం ఉందని అన్నారు. గతంలో తమ హక్కులు కోసం ఆర్టీసీ కార్మికులు ధర్నా నిర్వహిస్తే, ఆ యూనియన్లను రద్దుచేసి ఆర్టీసీ కార్మికుల పొట్ట కొట్టి నియంతృత్వ పాలన చేసిన ఘనత కెసిఆర్‌ది కాదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం పనిచేస్తున్న ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని రాబోయే రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలను అమలు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ మార్కెట్ కమిటీ చైర్మన్ రమణారావు, జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ అధ్యక్షులు ఎండి హబీబ్, మాజీ కౌన్సిలర్ నిజాముద్దీన్, కొత్త శ్రీనివాసులు, కాంగ్రెస్ నాయకులు తైలి శ్రీనివాసులు, కోటయ్య, నరసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# రైతుకు భరోసా.. భూభారతి చట్టం..

**మొదటి పేజీ తరువాయి భాగం..**

ఈ చట్టం ద్వారా రైతన్న భూమికి భద్రత నిస్తుందని ఎమ్మెల్యే జి మధుసూదన్‌రెడ్డి తెలిపారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణితో రైతులు భూ సమస్యలు పరిష్కారం కాక ఎన్నో కష్టాలు పడుతున్నారని ఈ కష్టాలను తీర్చేందుకే భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చిందని ఈ చట్టం ద్వారా ప్రతి రైతుకు న్యాయం జరుగుతుందని అని తెలిపారు. గత ప్రభుత్వ దొరలు భూములను దోచుకోవడానికే ధరణి చట్టాన్ని తీసుకొచ్చారని ఈ చట్టంతో దొరలు బాగుపడ్డారని ఆయన విమర్శించారు. నియోజకవర్గంలో దేవరకద్ర కొత్తకోట మండలాలలో సబ్ రిజిస్టర్ కార్యాలయం ఏర్పాటు చేయాలని అదేవిధంగా నూతనంగా ఏర్పడిన కౌకుంట్ల మండలంలో రెవిన్యూ కార్యాలయము ఏర్పాటు చేయాలని ఇందిరమ్మ ఇండ్ల సంఖ్యను పెంచాలని మంత్రికి విన్నవించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూభారతితో రైతుల కష్టాలు తొలుగుతాయని జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి తెలిపారు. ఈ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని భూముల సమస్యలు పరిష్కారం అవుతాయని ఆమె తెలిపారు ప్రభుత్వం ఎంతో అధ్యయనం చేసి ఈ భూభారతి చట్టాన్ని తీసుకొచ్చారని ఆమె తెలిపారు. అంతకుముందు హెలిప్యాడ్ వద్ద మంత్రికి ఎమ్మెల్యే జిల్లా కలెక్టర్ ఘన స్వాగతం పలికి సభ వద్దకు తీసుకువచ్చారు. అక్కడ జ్యోతి ప్రజ్వలనతో సదస్సు ప్రారంభమైంది. ఈ సభలో రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్ రావు, స్థానిక సంస్థల డిప్యూటీ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, ఆర్డిఓ నవీన్ కుమార్, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ కతలప్ప, విండో చైర్మన్ సురేందర్ రెడ్డి, దేవస్థాన చైర్మన్ గోవర్ధన్ రెడ్డి, సిసి కుంట కౌకుంట్ల మండల అధ్యక్షులు నరేందర్ రెడ్డి, రాఘవేందర్ రెడ్డి, తహసిల్దార్ ఎల్లన్న ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# యాసంగి పంట

# కొనుగోలు వేగవంతం చేయాలి

**మొదటి పేజీ తరువాయి భాగం..**

తిరస్కరిస్తున్నట్లు గమనించడం జరిగిందని అన్నారు. రైస్ మిల్లు వద్ద క్వింటాల్‌కు 5 కేజీలు తరుగు తీస్తున్నట్లు రైతులు ఆందోళన చెందుతున్నారని, కొనుగోలు కేంద్రాలలో గన్ని బ్యాగుల కొరత కూడా కొంత ఉందని అన్నారు. రాబోయే యాసంగి సీజన్ లో నూకలు అధికంగా వచ్చే వడ్ల విత్తనాలను పంట వేయకుండా రైతులలో అవగాహన కల్పించాలని మంత్రి అన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న పౌరసరఫరాల శాఖ కమీషనర్ డిఎస్ చౌహన్ మాట్లాడుతూ, జిల్లాలో ఉన్న రైస్ మిల్లర్లు నిబంధనలు ప్రకారం నడుచుకునేలా కలెక్టర్లు పకడ్బందీగా పర్యవేక్షించాలని అన్నారు. ధాన్యం రవాణాకు వాహనాల ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని, రైస్ మిల్లుల వద్ద ధాన్యం బస్తాలు అన్‌లోడింగ్ ఆలస్యం కాకుండా చూడాలని, హమాలీల కొరత ఉండకుండా జాగ్రత్త పడాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల వద్దకు పెద్ద ఎత్తున ధాన్యం వస్తున్నప్పటికీ వేగవంతంగా కొనుగోలు చేయడంలో కొంత ఆలస్యం జరుగుతుందని, వీటిని సంపూర్ణంగా నివారించాలని అన్నారు. ధాన్యం కొనుగోలు అంశంపై జిల్లా కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించి ప్రత్యేకంగా మానిటర్ చేయాలని అన్నారు. రైస్ మిల్లర్లు తాలు, తరుగు పేరు మీద ఎటువంటి కోతలు లేకుండా జాగ్రత్తలు పాటించాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద గన్ని బ్యాగులు ఉండాలని రైతులకు నేరుగా ఇవ్వవద్దని, మనం కొనుగోలు చేసిన ధాన్యం నింపేందుకు మాత్రమే వినియోగించాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి, అదనపు కలెక్టర్ రెవిన్యూ మోహన్ రావు, డిఆర్‌డిఓ నర్సింహులు, డిసిఓ శంకరాచారి, డిఎఓ వెంకటేష్ డిఎం సివిల్ సప్లయిస్ రవినాయక్ సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా బసవేశ్వర 892వ జయంతి వేడుకలు



జయంతి వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే ,మున్సిపల్ మాజీ చైర్మన్



పూలమాలలు వేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్ రెడ్డి



బసవ జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

**భూత్పూర్,ఏప్రిల్ 30.ప్రభాతవార్త :** గొప్ప సంఘ సంస్కర్త,తన తత్వ బోధనలతో ఆధ్యాత్మిక జ్ఞానాన్ని లోకానికి అందించిన మహాత్మా బసవేశ్వరుని 892వ జయంతి వేడుకల్ని భూత్పూర్‌లో బుధవారం వీర శైవసమాజం భక్తులు,శివభక్తులు,ఆధ్యాత్మికవాదులు ఘనంగా నిర్వహించారు.భూత్పూర్ జాతీయ రహదారి-44కూడలిలో మహాత్మా బసవేశ్వరుని చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా వేడుకల్ని నిర్వహించారు.ఈ వేడుకలకు మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి హాజరై బసవేశ్వరుని చిత్రపటానికి పూలమాలలు వేసి బసవేశ్వరుని గొప్పతనం,మహాత్యాన్ని వివరించారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ఆల మాట్లాడుతూ బసవేశ్వరుడు మానవ రూపంలో ఉన్న పరమేశ్వరుడని,కాయకవే కైలాస అంటూ బసవేశ్వరుడు శివతత్వాన్ని,భక్తిభావాన్ని ప్రజల్లో పెంపొందించారని పేర్కొన్నారు.బసవేశ్వరుని రచనలు,బోధనలు,తత్వాలు ప్రతి ఒక్కరూ అలవరచుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ సత్తూర్ బస్వరాజ్‌గౌడ్‌తో పాటు నాయకులు సత్తూర్ నారాయణగౌడ్,టి మురళిధర్‌గౌడ్,తూము శ్రీనివాస్‌రెడ్డి,సత్తూర్ చంద్రశేఖర్‌గౌడ్,మొల్గర నర్సింహులుగౌడ్,రాము రాథోడ్,గడ్డం ప్రేమ్‌కుమార్,సత్తూర్ సురేష్‌గౌడ్,వీరశైవ సమాజం నిర్వహకులు కోరె నాగరాజు,కోరె రవికుమార్,విశ్వనాథం,నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

**బసవేశ్వరుని బోధనలు స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలి**

**కోయిలకొండ, ఏప్రిల్ 30 ప్రభాతవార్త :** నేటి తరానికి బసవేశ్వరుని బోధనలు ఆదర్శప్రాయమైనవని, ఆయన బోధనలను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని నారాయణపేట మాజీ ఎమ్మెల్యే ఎస్. రాజేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆచార్యపూర్ గ్రామంలో గల వీరభద్ర స్వామి దేవాలయ సమీపంలోని బసవేశ్వరుని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యక్తుల జీవితాలను, సమాజ గమనాన్ని ప్రభావితం చేసే విధంగా బసవేశ్వరుడు తన సొంత ఒరవడితో కొత్త ధర్మాన్ని సృష్టించాడని అదే లింగాయత్ ధర్మమని అన్నారు. అనాదిగా వస్తున్నా మూఢనమ్మకాలను, ఆచారాలను తీవ్రంగా ఖండించడం జరిగిందన్నారు. సమ సమాజ ఒరవడికి శ్రీకారం చుట్టి నేటి సమాజానికి స్ఫూర్తిగా నిలవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు బి. కృష్ణ, జడ్పిటిసి సభ్యుడు విజయ భాస్కర్ రెడ్డి, ఖాజీపూర్ గ్రామ మాజీ సర్పంచ్ కల్పన బచ్చిరెడ్డి , మాజీ సింగిల్ విండో చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, ఆచార్యపూర్ గ్రామ మాజీ సర్పంచ్ టి.రాము, డి.నారాయణ గౌడ్, ఆర్. రమేష్, కె. రాజు, కోఆప్షన్ మాజీ సభ్యుడు టీవీ ఖాజా, బలిజ లింగాయత్ మండలాధ్యక్షులు గాజుల ప్రవీణ్, గౌరవ అధ్యక్షులు కె.శివకుమార్, ప్రధాన కార్యదర్శి శేఖర్, కోరి రాజలింగం, మల్లికార్జున్, రాఘవేందర్, బి. రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

**ఘనంగా శ్రీ శ్రీ బసవేశ్వర జయంతి వేడుకలు**

**పెబ్బేరు, ఏప్రిల్ 30 ప్రభాతవార్త :** బసవేశ్వర 892 వ జయంతి వేడుకలను పెబ్బేరు మండల కేంద్రంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. పెబ్బేరు పట్టణం వీరశైవ లింగాయత్ కుటుంబ సభ్యులతో కలిసి అధ్యక్షుడు సిద్ధం నాగరాజు ఆధ్వర్యంలో బసవేశ్వరుని చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా బసవ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమం లో ఉమామహేశ్వర్, బస్వరాజ్, జంగం నాగ మల్లయ్య, శివయ్య, రాజశేఖర్, సిద్ధంమణికంఠ, కోరె బస్వరాజ్, జర్నలిస్ట్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

**పీయూలో బసవేశ్వరుడు జయంతి వేడుకలు**

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఏప్రిల్ 30 ప్రభాతవార్త :** పాలమూరు యూనివర్సిటీలో పరిపాలన భవన్ యందు బీసీ సెల్ ఆధ్వర్యంలో బసవేశ్వరుడి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. వేడుకలకు అకాడమిక్ ఆడిట్ సెల్ సంచాలకులు డా.చంద్రకిరణ్ ముఖ్య అతిధిగా హాజరై,బసవేశ్వరుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో కుల వ్యవస్థను, వర్ణ భేదాలను, లింగ వివక్షతను సమూలంగా వ్యతిరేకించిన అభ్యుదయవాది అని అన్నారు. కార్యక్రమంలో బీసీ సెల్ డైరెక్టర్ డా. ప్రవీణ, ఎస్సీ, ఎస్టీ, సెల్ డైరెక్టర్ కుమారస్వామి, వైస్ ప్రిన్సిపాల్ డా. కృష్ణయ్య, ప్రిన్సిపాల్ డా. రవికాంత్ పాల్గొన్నారు.

**ఘనంగా బసవ జయంతి వేడుకలు**

**మక్తల్, ఏప్రిల్ 30 ప్రభాతవార్త :** బసవ జయంతి వేడుకలను బుధవారం మక్తల్ పట్టణంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మక్తల్ పట్టణ సమీపంలోని మినీ ట్యాంక్ బండ్ వద్ద గల బసవేశ్వరుని విగ్రహానికి స్థానిక ఎమ్మెల్యే డా. వాకిటి శ్రీహరితో పాటు వివిధ రాజకీయ పక్షాల నాయకులు, వీరశైవ లింగాయత్ పరిషత్ ప్రతినిధులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అలాగే స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో బసవేశ్వరుని చిత్రపటానికి తహసిల్దార్ సతీష్ కుమార్, డిటి పుష్పలత ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ ఎంపీపీ బి.కొండయ్య, నేరేడుగం పీఠాధిపతి సిద్ధిలింగేశ్వర స్వామి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గణేష్ కుమార్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు రవికుమార్, వీరేశం తదితరులు పాల్గొన్నారు.

**గొప్ప సంఘ సంస్కర్త మహాత్మా బసవేశ్వరుడు**

**అడిషనల్ కలెక్టర్ లోకల్ బాడీ సంచిత్ గంగ్వార్**

**నారాయణపేట టౌన్, ఏప్రిల్ 30 ప్రభాతవార్త :** సమాజ శ్రేయస్సు కోసం పాటుపడిన గొప్ప సంఘ సంస్కర్త మహాత్మా బసవేశ్వరుడనీ అడిషనల్ కలెక్టర్ సంచిత్ గంగ్వార్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఘనంగా మహాత్మా బసవేశ్వర 892 వజయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మహాత్మా బసవేశ్వర చిత్రపటానికి అడిషనల్ కలెక్టర్ పూలమాలలు వేశారు. అలాగే సరాఫ్ బజార్ బసవేశ్వర స్వామి దేవాలయంలో బసవేశ్వర్ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతికి ఎంతో కృషి చేశాడన్నారు. సమాజంలో స్త్రీ, పురుషులు ఇద్దరికీ సమాన హక్కుల కోసం కృషి చేశాడనీ తెలిపారు. ఆయన వచనాలతో సమాజంలో సాంఘిక చైతన్యం కోసం పాటుపడ్డారన్నారు. కర్ణాటక రాష్ట్రం విజయపురి జిల్లాలో జన్మించాడని తెలిపారు. జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి అబ్దుల్ ఖలీల్, డిపిఆర్ఓ రషీద్, అగ్రికల్చర్ అధికారి జాన్ సుధాకర్, ఆర్‌విఎల్‌ఎల్ బి నారాయణపేట జిల్లా అధ్యక్షులు ఆవుటి రవికుమార్, కె.మల్లికార్జున్, గందే రవికాంత్, అరకంచి రవి కుమార్, బర్మా నాగభూషణం, కన్న జగదీష్, కన్న శివకుమార్, డా. సచిన్ మంగలిగి, పొగాకు శంకరన్న, మల్లికార్జున్, ల్యాబ్ శివకుమార్, లిక్కి రఘుబాబు, సంతోష్, గందే సుమిత్, ఆకుల రాజేష్, బుక్క రాజు, సందీప్, గాలి లోకేష్, సులిగం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

**బసవేశ్వరుడు గొప్ప అభ్యుదయ వాది**

**ఇటిక్యాల, ఏప్రిల్ 30 ప్రభాతవార్త :** సమాజంలో కుల వర్ణ లింగ వివక్షతను వ్యతిరేకించిన గొప్ప అభ్యుదయ వాది బసవేశ్వరుడు అని అలాగే సమ సమాజ నిర్మాణం కోసం గళం విప్పి సమానత్వాన్ని ప్రబోధించి విప్లవాత్మక మార్పులకు నాంది పలికి మహిళలకు గౌరవ స్థానం ఇవ్వడం సాధికారత కల్పించడంలో ఆయన చేసిన కృషి స్ఫూర్తిదాయకమని తహసిల్దార్ వీరభద్రప్ప గుర్తు చేశారు. బుధవారం గొప్ప అభ్యుదయవాది బసవేశ్వరుని జయంతిని పురస్కరించుకొని తహసిల్దార్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి తహసిల్దార్ వీరభద్రప్ప, డిప్యూటీ తాహసిల్దార్ నందిని, ఆర్ఐ మనోహర్, సిబ్బంది ఆధ్వర్యంలో పూలమాలవేసి నివాళులర్పించారు.

**సమాజంలో కుల, వర్ణ, లింగ వివక్షతను వ్యతిరేకించిన గొప్ప అభ్యుదయవాది శ్రీ బసవేశ్వరుడు**

**గద్వాల, ఏప్రిల్ 30 ప్రభాతవార్త :** సమాజంలో కుల,వర్ణ,లింగ వివక్షతను వ్యతిరేకించిన గొప్ప అభ్యుదయవాది శ్రీ మహాత్మా బసవేశ్వరుడని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ తెలిపారు. బుధవారం ఐడిఓసీ కార్యాలయం ఆవరణంలో బీసీ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన బసవేశ్వర జయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని,బసవేశ్వర చిత్రపటానికి పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, మహాత్మా బసవేశ్వరుడు కుల, వర్ణ, లింగ భేదాలు లేని సమసమాజ నిర్మాణం కోసం గళం విప్పి సమానత్వాన్ని ప్రబోధించి సమాజంలో విప్లవాత్మక మార్పులకు నాంది పలికారని పేర్కొన్నారు.మహిళలకు గౌరవస్థానం ఇవ్వడం, సాధికారత కల్పించడంలో ఆయన చేసిన కృషి స్ఫూర్తిదాయకమని అన్నారు. శ్రమకు గౌరవం, నీతి, నిష్ఠ, సత్యాన్ని బసవేశ్వరుడు తన జీవిత విధానంగా మార్చుకున్నారని అన్నారు. ప్రతి ఒక్కరూ బసవేశ్వరుని ఆదర్శాలను అనుసరించి, సమాజంలో మంచి మార్పుకు భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. ఆయన వచనాలు నేటి యువతకు మార్గదర్శకంగా నిలుస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ, ఆర్డీఓ శ్రీనివాసరావు, బిసి సంక్షేమ అధికారి రమేష్ బాబు, ఏఓ నరేందర్, అధికారులు, సంఘం సభ్యులు, కలెక్టరేట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

**12వ శతాబ్దంలోనే సామాజిక న్యాయం కోసం విప్లవానికి బీజం వేసిన మహనీయులు శ్రీ బసవేశ్వరుడు**

**గండీడ్, ఏప్రిల్ 30 ప్రభాతవార్త :** సామాజిక న్యాయం కోసం 12వ శతాబ్దంలోనే విప్లవానికి బీజం వేసిన మహనీయులు, వీరసేవ లింగయాత్ సాంప్రదాయ వ్యవస్థాపకులు శ్రీ బసవేశ్వరుడు అని పలువురు వీరశైవ సమాజ సభ్యులు అన్నారు. గండీడ్ మండలం వెన్నాచెడ్ గ్రామంలో బుధవారం మహాత్మ శ్రీ బసవేశ్వర 892 వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు శ్రీ బసవేశ్వరుడి విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా పలువురు వీరశైవ సమాజ నాయకులు మాట్లాడుతూ కుల వ్యవస్థను వ్యతిరేకించి సమానత్వాన్ని బోధించిన అభ్యుదయ వాది మహాత్మా బసవేశ్వరుడేనని అన్నారు. ఈ కార్యక్రమంలో వెన్నాచెడ్ గ్రామంతో పాటు వివిధ గ్రామాల్లోని వీరశైవ సమాజ సభ్యులు గ్రామస్తులు యువకులు తదితరులు పాల్గొన్నారు.



బసవేశ్వర జయంతిని జరుపుకున్న వీరశైవ సభ్యులు



ఇటిక్యాల తహసిల్దార్ కార్యాలయంలో



నివాళులు అర్పిస్తున్న జిల్లా కలెక్టర్ సంతోష్ ,అదనపు కలెక్టర్

## వరి ధాన్యం కొనుగోలు చేసి మిల్లులకు

# ఎప్పటికప్పుడు తరలించే విధంగా చర్యలు

**వరి ధాన్యం సేకరణ పై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**



వరి ధాన్యం సేకరణ పై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**వనపర్తి టౌన్, ఏప్రిల్ 30 ప్రభాతవార్త:** నిబంధనలకు అనుగుణంగా వరి ధాన్యం కొనుగోలు చేసి మిల్లులకు ఎప్పటికప్పుడు తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు. యాసంగిలో రైతులు పండించిన వరి ధాన్యం సేకరణపై జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. రైతులకు ఇబ్బందులు లేకుండా నిబంధనలకు అనుగుణంగా తేమ వచ్చిన వెంటనే వరి ధాన్యం తూకం చేయించి కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను సూచించారు. ట్రాన్స్‌పోర్ట్, గన్ని బ్యాగులు తదితర సమస్యలు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్షాల పై ఎప్పటికప్పుడు వాతావరణ శాఖ నుండి రిపోర్టు తీసుకొని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు సమాచారం ఇవ్వాలని తెలియజేశారు. వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ వనపర్తి జిల్లాలో గత రబీ సీజన్ లో 90 వేల మెట్రిక్ టన్నులు దిగుబడి వస్తే ఈసారి యాసంగిలో 3.00 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉందన్నారు. జిల్లాలో 179 రైస్ మిల్లులు ఉన్నప్పటికినీ గత సీజన్లలో మిల్లులు సకాలంలో సి.యం.ఆర్ ఇవ్వనందున వందకు పైగా మిల్లులను బ్లాక్ లిస్ట్ లో పెట్టడం జరిగిందన్నారు. ఉన్న మిల్లులకు మిల్లింగ్ స్థాయికి మించి కేటాయించినప్పటికి ఇంకా చాలా వడ్లు మిల్లులకు కేటాయించవలసిన అవసరం ఉందని అందువల్ల పక్క జిల్లాల మిల్లులకు ధాన్యం కేటాయించే విధంగా అనుమతి ఇవ్వాలని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన పౌర సరఫరాల శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ డిఎస్ చౌహాన్ బ్లాక్ లిస్ట్‌లో పెట్టిన మిల్లు యజమానులతో మాట్లాడి డిఫాల్ట్ అయిన మిల్లర్ల నుండి పరిహారం వసూలు చేసి బ్యాంక్ గ్యారంటీ తీసుకొని వడ్లు కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ రాష్ట్రంలో రైతుల ధాన్యం నుండి తరుగు తీయవద్దని ఎక్కడైనా తరుగు తీస్తున్నట్లయితే చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను సూచించారు. అదనపు కలెక్టర్ రెవెన్యూ జి వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ నాయక్, జిల్లా పౌర సరఫరాల అధికారి విశ్వనాథ్, జిల్లా మార్కెటింగ్ అధికారి స్వరణ్ సింగ్, సివిల్ సప్లయ్ డి.ఎం జగన్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

**దాన్యం కొనుగోళ్లను జిల్లా కలెక్టర్ లు క్షేత్ర స్థాయిలో పరిశీలించాలి**

**గద్వాల,ఏప్రిల్ 30 ప్రభాతవార్త:** ధాన్యం కొనుగోళ్లు సునిశితమైన అంశమని,జిల్లాకలెక్టర్లు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ ఎటువంటి అవాంతరాలు కలుగకుండా చూడాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం యాసంగి ధాన్యం కొనుగోలుపై రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హైదరాబాద్ నుండి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడుతూ, రానున్న 1520 రోజులు ధాన్యం కొనుగోళ్లు ఉధృతంగా ఉంటాయని, ఈ సమయంలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని అన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం సేకరణ జరగాలని సూచించారు. గోడౌన్ లు అందుబాటులో లేని చోట అందుబాటులో ఉన్న మిల్లులకు ధాన్యం తరలించాలని సూచించారు. రాష్ట్రంలో 54.89 లక్షల ఎకరాల్లో రబీ సాగు చేయడం జరిగిందని, కనీసం 137.10 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అంచనా ప్రకారం 70.13 లక్షల మెట్రిక్ టన్నుల వరకు ప్రభుత్వం కొనుగోలు చేసేందుకు ప్రణాళికలు రూపొందించడం జరిగింది అన్నారు. ధాన్యం సేకరణకు సరిపడా గన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచాలన్నారు. ధాన్యం కొనుగోళ్లకు రాష్ట్ర వ్యాప్తంగా 8,381 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. సన్నాలకు సత్వరమే బోనస్ డబ్బులు చెల్లించాలని, ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే రైతుల ఖాతాలో నగదు జమ చేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్, అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు, జిల్లా పౌరసరఫరాల అధికారి స్వామి కుమార్, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ విమల, జిల్లా మార్కెటింగ్ అధికారి పుష్పమ్మ, జిల్లా కోఆపరేటివ్ అధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పది పలితాల్లో మైనార్టీ

## బాలుర గురుకుల విద్యార్థుల ప్రభంజనం




**జడ్చర్ల,ఏప్రిల్ 30 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం పదవ తరగతి ఫలితాలు విడుదల చేసిన ఫలితాలలో జడ్చర్ల నాగసాలలోని తెలంగాణ మైనారిటీ గురుకుల బాలుర పాఠశాలలో 35 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 34 మంది పాస్ అయ్యే 97 శాతం ఉత్తీర్ణత సాధించారు. పాఠశాల టాపర్‌గా ఏ కార్తీక్ రెడ్డి 600కు గాను 543/600 మార్కులు, శివ ప్రసాద్ 511/600, ఎండి మోసిన్ బాబా 509/600, సి మహేష్ 508/600 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపల్ పారిజాత ఇతర ఉపాధ్యాయులు విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

## గద్వాల ఆసుపత్రిలో అన్ని సమస్యలే

**బీజేపీ రాష్ట్ర యువ నాయకురాలు డీకే స్నిగ్ధ రెడ్డి**



గాయపడిన వారిని పరామర్శించిన డికే స్నిగ్ధరెడ్డి

**గద్వాల, ఏప్రిల్ 30 ప్రభాతవార్త :** గద్వాల ఏరియా ఆసుపత్రిలో అన్ని సమస్యలు నెలకొని ఉన్నాయని వైద్య సిబ్బంది విధులకు సక్రమంగా రావడం లేదని, ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4గంటల వరకు విధులు నిర్వహించడం లేదని బీజేపీ రాష్ట్ర యువ నాయకురాలు డీకే స్నిగ్ధ రెడ్డి ఆరోపణలు చేశారు. మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయాలతో చికిత్స పొందుతున్న వారిని ఆమె బుధవారం పరామర్శించారు. వారికి మెరుగైన వైద్య అందించాలని బిజెపి యువ నాయకురాలు డికె. స్నిగ్ధా రెడ్డి వైద్య సిబ్బందిని కోరారు. ఈ సందర్భంగా డీకే స్నిగ్ధా రెడ్డి మాట్లాడుతూ ఐసీయూ లో ఏసీ పనిచేయడం లేదన్నారు. తాత్కాలిక ఫ్యాన్లు ఐసీయూ ఉంచారన్నారు. వెంటనే ఐసీయూలో ఏసీలు బాగు చేయించాలని అధికారులను డిమాండ్ చేశారు. రోగులకు అన్ని విధాలుగా మెరుగైన వైద్యం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు మాజీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి ,రాష్ట్ర కౌన్సిలింగ్ మెంబర్ అక్కల రమాదేవి,అసెంబ్లీ పోటీ చేసిన బలిగేరా శివారెడ్డి, పట్టణ అధ్యక్షురాలు రజక జయశ్రీ నరసింహులు,బిజెపి నాయకులు చిత్తారి కిరణ్, దేవదాసు,నరసింహ శెట్టి,తరుణ్ తదితరులు ఉన్నారు.

## తల్లిదండ్రులకు జరిమానా

**మైనర్లు డ్రైవింగ్ చేయడంతో ట్రాఫిక్ పోలీస్ శాఖ చర్యలు**

**మహబూబ్‌నగర్, ఏప్రిల్ 30 ప్రభాతవార్త:** మైనర్ రోడ్ డ్రైవింగ్ చేయడంతో వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సిలింగ్ చేసి జరిమానా విధించిన సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో చోటు చేసుకున్నది. జిల్లా పోలీస్‌ధికారి డి. జానకి ఆదేశాల మేరకు, వేసవి సెలవుల్లో మైనర్లు ద్విచక్ర వాహనాలు నడపడం వంటి ప్రమాదకర చర్యలను అరికట్టే ఉద్దేశంతో మహబూబ్ నగర్ పట్టణంలో ట్రాఫిక్ విభాగం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించింది. ఈ సందర్భంగా మైనర్లు డ్రైవింగ్ చేస్తూ పట్టుబడిన కేసులలో, వారి తల్లిదండ్రులను ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించారు. సురక్షిత రహదారి ప్రయాణం గురించి అవగాహన కల్పించడమే కాకుండా, ప్రతి తల్లిదండ్రుడికి రూ.1500 జరిమానా విధించారు. ఈసందర్భంగా ట్రాఫిక్‌ఇన్స్పెక్టర్ భగవంత్ రెడ్డి మాట్లాడుతూ "వాహనాల నడపడం అనేది పూర్తిగా బాధ్యతతో కూడిన చర్య అని, మైనర్లు వాహనాలు నడపడం వల్ల వారు మాత్రమే కాదు, ఇతర ప్రయాణికుల ప్రాణాలకూ ప్రమాదం ఏర్పడుతుందన్నారు. తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండి పిల్లలకు వాహనాలు ఇవ్వకుండా, వారి భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. డ్రైవ్ నిరంతరంగా కొనసాగుతుందన్నారు. మహబూబ్‌నగర్ పోలీస్ విభాగం ప్రజల సహకారంతో రహదారి భద్రతను మెరుగుపరచేందుకు కృషి చేస్తోందని పేర్కొన్నారు.

## రిటైర్మెంట్ వృత్తికే కానీ వ్యక్తిత్వనికి కాదు

**జిల్లా ఎస్పీ టీ. శ్రీనివాస్ రావు**

**అలంపూర్, ఏప్రిల్ 30 ప్రభాతవార్త :** శేషా జీవితాన్ని కుటుంబ సభ్యులతో, స్నేహితులతో కలిసి ఆనందంగా గడపాలని జోగులాంబ గద్వాల జిల్లా ఎస్పీ టీ. శ్రీనివాస్ రావు అన్నారు. బుధవారం ఉండవెల్లి మండలం లోని ఉండవెల్లి పోలీస్ స్టేషన్ ఏ ఎస్ఐ సుబ్బారెడ్డి పదవి విరమణ చేసిన పోలీసు అధికారినీ ఘనంగా సన్మానించిన జిల్లా ఎస్పీ శ్రీ టి. శ్రీనివాసరావు, ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ, పదవి విరమణ పొందిన పోలీస్ అధికారులు తమ శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో, స్నేహితులతో ఆనందంగా గడపాలని జిల్లా ఎస్పీ టి.శ్రీనివాసరావు ఐపీఎస్ అన్నారు. జిల్లాలో సుమరు 36 సంవత్సరాలుగా వివిధ హోదాలలో పనిచేసి పదవి విరమణ పొందుతున్న ఉండవల్లి పోలీస్ స్టేషన్ ఏ.ఎస్సై సుబ్బారెడ్డి దంపతులను జిల్లా ఎస్పీ తన ఛాంబర్ లో ఘనంగా సన్మానించారు. పోలీస్ డిపార్ట్మెంట్లో సుదీర్ఘంగా సర్వస్ పూర్తి చేసుకుని పదవీ విరమణ చేయడం ఏంతో అభినందనీయం ఆని, ఉద్యోగ నిర్వహణలో అంకిత భావంతో పనిచేసి అందరి మన్ననలను పొందినారని అన్నారు. వారి సర్వీస్ కు సంబంధించిన రిటైర్డ్ మెంట్ బెనిఫిట్ పత్రాలు అందచేశారు. పోలీస్ విభాగంలో సుధీర్ఘకాంగా విధులు నిర్వహించి పదవీవిరమణ చేసిన సిబ్బంది సేవను మరువమని పోలీసు రిటైర్ మెంట్ కేవలం తన వృత్తికే, కాని తన వ్యక్తిత్వానికి కాదు" అని కొనియాడారు. విధి నిర్వహణలో పగలనక, రాత్రనక, పండగల సమయంలో భార్యా, పిల్లలకు దూరంగా ఉండి విధులు నిర్వహించినారని, పదవి విరమణ చేసిన పోలీసులు ఇకపై కుటుంబ సభ్యులతో అనందంగా వారి శేష జీవితం ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డి.ఎస్పీ మొగిలయ్య, కార్యాలయ ఏ.ఓ సతీష్ కుమార్, ఆలంపూర్ సీఐ రవి బాబు, ఉండవల్లి ఎస్సై మహేశ్, డీసీ అర్బి ఎస్సై షకూర్ తదితరులు పాల్గొన్నారు.

## భీమరాజు కుటుంబానికి అండగా ఉంటాం!

**మంత్రి జూపల్లి కృష్ణారావు**

**కొల్లాపూర్, ఏప్రిల్ 30 ప్రభాతవార్త :** మండల పరిధిలోని కుడికిల్ల గ్రామానికి చెందిన మాచుపల్లి భీమరాజ్ మృతి చెందడంతో మృతుని కుటుంబ సభ్యులను మంత్రి జూపల్లి కృష్ణారావు పరామర్శించారు. అనంతరం భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. భీమరాజు కొల్లాపూర్ పాలమూరు యూనివర్సిటీలో కంప్యూటర్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. గత కొన్ని రోజుల నుండి బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతూ, హైదరాబాదులోని ఒక ప్రైవేటు హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మంగళవారం సాయంకాలం తుది శ్వాసను విడిచాడు. విషయం తెలుసుకున్న,రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు, కుడికిల్ల గ్రామానికి వెళ్లి భీమరాజు భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే భీమరాజు భార్యను రెండు సంవత్సరాల కుమారుని, తమ్ముని తల్లిని, ఓదార్చారు. వారి కుటుంబానికి ఆయన ప్రగాఢ సానుభూతిని తెలిపి ఆ కుటుంబానికి అండగా ఉంటానని ఆయన హామీ ఇచ్చారు. భీమరాజు అంతిమ యాత్ర కార్యక్రమంలో కుడికిల్ల మాజీ సర్పంచ్, ప్రజా ప్రతినిధులు తోటి ఉద్యోగులు,అలాగే కుడికిల్ల గ్రామస్తులు, భీమరాజు బంధుమిత్రులు, స్నేహితులు అభిమానులు పాల్గొన్నారు.

## పదిలో ప్రభుత్వ పాఠశాలల ప్రభంజనం

**చిన్నంబావి, ఏప్రిల్ 30 ప్రభాతవార్త :** మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు పదవ తరగతి ఫలితాల్లో ప్రతిభ చాటారు. మండలంలో 194 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షకు హాజరు కాగా 193 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఉత్తీర్ణత శాతం 99.48 కాగా మండల టాపర్‌గా టీ. నందిని 554 మార్కులు కేజీబీవీ పాఠశాల విద్యార్థి సాధించారు. రెండవ టాపర్‌గా ప్రణవి రెడ్డి 549 ప్రైవేటు వివేకానంద పాఠశాల విద్యార్థి. అలాగే తెలుగు మీడియంలో పెద్ద దగడ జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలకు చెందిన జింకల శ్రీనివాసులు 538 మార్కులు సాధించి మొదటి స్థానం పొందారు. తెలుగు మీడియంలో రెండవ టాపర్‌గా ఇద్దరు విద్యార్థులు దగడపల్లి జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలకు చెందిన మునీశ్వరి 537, అయ్యవారిపల్లి పాఠశాలకు చెందిన శ్వేత 537 మార్కులు సాధించారు. పలు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. దీంతో మండల నాయకులు, అధికారులు ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులను విద్యార్థులను అభినందించారు.

## సమ్మర్ క్యాంప్ ప్రారంభం

**మాగనూరు, ఏప్రిల్ 30 ప్రభాతవార్త:** మాగనూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రేపటినుండి సమ్మర్ క్యాంప్ నిర్వహించడం జరుగుతుందని ఎంఈఓ మురళీధర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలియజేయడం జరిగింది. ఈసమ్మర్‌క్యాంపులో విద్యార్థులు అధికసంఖ్యలో పాల్గొని విద్యార్థుల నైపుణ్యతను మరింత మెరుగుపరచడం కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. ఈసమ్మర్‌క్యాంపులో విద్యార్థులు వివిధరకాల కలలలో పాల్గొనవచ్చు అని డాన్స్ కరాటే ఆటల పోటీలు వంటివి నిర్వహిస్తున్నట్లు తెలియజేయడం జరిగింది.

## పదవ తరగతిలో మండల టాపర్‌గా హన్సిక

**రాజాపూర్,ఏప్రిల్ 30 ప్రభాతవార్త :** పదవతరగతి ఫలితాలలో రాజాపూర్ మండలం మల్లేపల్లి గ్రామానికి చెందిన అల్వాల హన్సిక 537 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది. మండల కేంద్రం సమీపంలో గల కస్తూర్బా గాంధీ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న హన్సిక మండల టాపర్‌గా నిలవడం పట్ల పాఠశాల యాజమాన్యం విద్యార్థులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## పది ఫలితాలలో 100 శాతం ఉత్తీర్ణత

**మాగనూరు, ఏప్రిల్ 30 ప్రభాతవార్త :** మాగనూరు మండల కేంద్రంలోని బుధవారం వెలువడిన పదవ తరగతి ఫలితాలలో విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. మాగనూర్ మండల గ్రామానికి చెందిన బి.నిరంజని మండల టాపర్‌గా జడ్పీ హైస్కూల్ నుండి 540 మార్కులు సాధించింది. మాగనూర్ కేజీబీవీలో 521, నేరేడగాం హైస్కూల్ 519, వడ్వాట్ హైస్కూల్ 516 మార్కులతో స్కూల్ టాపర్‌గా నిలిచారు. మండల టాపర్‌గా నిలిచిన నిరంజని నిరుపేద జర్నలిస్టు కుటుంబం నుంచి వచ్చానని, తన తండ్రి చిన్న వయసులోనే చనిపోవడంతో నాన్న నేర్పిన సేవ భావాలతోనే ఎంబిబిఎస్ పూర్తి చేసి పేదలకు వైద్య సేవలు అందించడమే తన లక్ష్యమని తెలిపింది. మండలంలో ఉన్న జడ్పీ హైస్కూల్స్‌లలో మాగనూర్, నేరడగం, కేజీబీవీ 100 ఉత్తీర్ణత సాధించాయి. వడ్వాట్ హైస్కూల్ 98 ఉత్తీర్ణత సాధించారు. ఆ పాఠశాల హెడ్ మాస్టర్ మురళీధర్‌రెడ్డి, ఉపాధ్యాయ బృందం అభినందించడం జరిగింది.

## విద్యార్థి కుటుంబానికి మంత్రి జూపల్లి భరోసా

**పానుగల్, ఏప్రిల్ 30 ప్రభాతవార్త :** మండల పరిధిలోని రాయినిపల్లి గ్రామానికి చెందిన విద్యార్థిని మనిషా శ్రీ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం బాధాకరమని రాష్ట్ర ఎక్సైజ్ అండ్ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మంగళవారం గద్వాల జిల్లా కేంద్రంలో కళాశాల నుండి హాస్టల్ కు వెళ్లేందుకు బస్సు కోసం వేచి చూస్తుండగా బులెరో వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే చనిపోవడం జరిగింది. బుధవారం వారి స్వగ్రామంలో మృతి దేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు అధైర్య పడవద్దని కుటుంబానికి తాను అండగా ఉంటానని భరోసా కల్పించారు. తక్షణ సహాయంగా 20 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. విద్యార్థిని కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకుంటానని హామీ ఇచ్చారు.

# దేశానికే రోల్ మోడల్‌గా భూ భారతి

**వనపర్తి ప్రతినిధి, ఏప్రిల్ 30 ప్రభాతవార్త :** రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిర్మించిన భూ భారతి చట్టం దేశానికే రోల్ మోడల్ అని రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రాష్ట్ర ఆబ్కారీ, పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు మల్లు రవితో కలిసి 193 కోట్ల అభివృద్ధి పనులకు, శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. వనపర్తి జిల్లా ప్రభుత్వ వైద్య కళాశాలలో 2259 చదరపు గజాల్లో రూ. 8.50 కోట్లతో నిర్మించిన పిజి విద్యార్థుల వసతి గృహాన్ని, 1002 చదరపు గజాల స్థలములో రూ. 4.00 కోట్లతో నిర్మించిన ప్రిన్సిపాల్, సిబ్బంది క్వార్టర్ భవనాలకు రిబ్బన్ కత్తిరించి ప్రారంభోత్సవం చేశారు. మండల అభివృద్ధి అధికారి కార్యాలయ సముదాయంలో రూ. 5.00 లక్షలతో ఏ విధంగా ఒక ఇల్లు నిర్మించవచ్చో ఇందిరమ్మ ప్రదర్శన ఇంటిని ప్రారంభోత్సవం చేశారు. అక్కడే రేవల్లి, శ్రీరంగాపూర్, ఎదుల మండల తహసిల్దార్ కార్యాలయాల భవనాలకు శంఖుస్థాపన చేశారు. ఒక్కో కార్యాలయ భవనానికి రూ. 32 లక్షలకు అంచనా ఖర్చు చేయనున్నారు. అదేవిధంగా ఎంపీ లాడ్ నిధులు రూ. 1.20 కోట్ల వ్యయంతో నిర్మించనున్న సోషల్ వెల్ఫేర్ బాలికల వసతి గృహ భవనానికి శంఖుస్థాపన చేశారు. కేడిఆర్ పాలిటెక్నిక్ కళాశాల వెనుక భాగంలో ఉన్న పాత భావాన్ని రూ. 69 లక్షల ఖర్చుతో పునర్వ్యవస్థీకరణ చేసిన కళాశాల విద్యార్థుల బాలుర వసతి గృహాన్ని రిబ్బన్ కత్తిరించి ప్రారంభోత్సవం చేశారు. వనపర్తి జిల్లా ప్రజలు, పిల్లలు ఉదయం సాయంత్రం పూట ఆహ్లాదకరంగా గడపటానికి రూ .55 లక్షల వ్యయంతో డా. బి.ఆర్. అంబేద్కర్ (నల్ల చెరువు) చెరువు అభివృద్ధి, సుందరీకరణ పనులను ప్రారంభోత్సవం చేశారు. మైనారిటీ సంక్షేమ శాఖ ద్వారా మైనారిటీ మహిళల స్వయం ఉపాధి కొరకు 200 కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. వనపర్తి నియోజక వర్గంలో 3500 ఇందిరమ్మ ఇళ్లకు రూ. 175 యూనియన్ బ్యాంకు వారి ఆధ్వర్యంలో చేపట్టే గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ నిర్మాణానికి రూ. 2 కోట్లు, విద్యార్థులకు వేసవి క్రీడ శిక్షణ శిబిరాలకు క్రీడా సామాగ్రి పంపిణీ కోసం రూ.1 లక్ష రూపాయలు మొత్తం 193 కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం వనపర్తి పట్టణంలోని కళ్యాణసాయి ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన భూ భారతి చట్టం అవగాహన కార్యక్రమంలో రాష్ట్ర ఆబ్కారీ పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం నాలుగు గోడల మధ్య నలుగురు వ్యక్తులు కలసి వారి స్వార్థం కోసం ధరణి చట్టాన్ని తీసుకువచ్చారు. కానీ నిబంధనలు పెట్టడం మరిచారు. లోపభూయిష్టమైన ధరణి చట్టం వల్ల రైతులు పడుతున్న సమస్యలు, ఇబ్బందులను గమనించి రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, రేవంత్ రెడ్డి ఆనాడు రాష్ట్రంలో కాంగ్రెస్‌ను ఆదరిస్తే ధరణి చట్టాన్ని



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

బంగాళా ఖాతంలో పడేస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ ప్రకారం దేశంలోని 18 రాష్ట్రాల్లో పర్యటించి అక్కడ ఉన్న భూ చట్టాలను అధ్యయనం చేసి వాటిలోని మంచి అంశాలను, రెవెన్యూ అధికారులు, న్యాయ కోవిదులు, రైతులతో చర్చించి ధరణిలో ఉన్న సమస్యలు అన్నింటికి పరిష్కారం చూపే భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చి ఏప్రిల్ 14న డా.బి.ఆర్. అంబేద్కర్ జయంతి రోజున తెలంగాణ రాష్ట్ర ప్రజలకు అంకితం చేయడం జరిగిందన్నారు. పాస్ పుస్తకంలో ఏదైనా తప్పులు జరిగితే సరిదిద్దుకునేందుకు ధరణిలో ఎలాంటి అవకాశం లేదు. కానీ భూ భారతి చట్టంలో సవరించుకునే అవకాశం కల్పించారు. అధికారులు తప్పు చేస్తే తప్పు చేస్తే చేసిన తప్పును సరిదిద్దేందుకు రైతులు కోర్టుల చుట్టూ తిరుగుతూ మంగళ సూత్రాలు అమ్ముకొని రైతులు రోడ్డున పడ్డారు. అదే భూ భారతి చట్టంలో రూపాయి ఖర్చు లేకుండా తహసిల్దార్ తప్పు చేస్తే ఆర్డీఓ కు, ఆర్డీఓ తప్పు చేస్తే కలెక్టర్ అక్కడ కూడా న్యాయం జరగకుంటే సిసిఎల్ఏ లేదా ట్రిబ్యునల్‌లో ఫిర్యాదు చేసుకునే అవకాశం భూ భారతిలో కల్పించడం జరిగింది. భూమి రిజిస్ట్రేషన్ చేయిస్తే ముందుగా సర్వే చేయించి భూమి పటాన్ని పాస్ పుస్తకంలో ముద్రించడం జరుగుతుంది.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి

**ప్రజల భూ సమస్యలు తీర్చడానికి తెచ్చిన భూ భారతి ..**

**జిల్లాలో రూ. 193 కోట్ల అంచనా వ్యయంతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు**

**రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**

సర్వే చేయడానికి ప్రస్తుతం ఉన్న సర్వేయర్లను 1000 మందికి పెంచడం జరుగుతుందన్నారు. అదేవిధంగా ప్రతి మండలానికి 10 మంది సర్వేయర్ల చొప్పున ప్రైవేట్ సర్వేయర్లను శిక్షణ ఇచ్చి వారి సేవలు వినియోగించుకోవడం జరుగుతుంది గ్రామ రెవెన్యూ అధికారులను త్వరలోనే ప్రతి గ్రామానికి నియమించుకోవడం జరుగుతోందన్నారు. భూ భారతి చట్టాన్ని రాష్ట్రంలోని 4 మండలాలను పైలెట్ మండలాలుగా ఎంచుకొని వాటిలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి భూ సమస్యలు పరిష్కరించడం జరుగుతుందన్నారు. త్వరలోనే ప్రతి జిల్లాలో ఒక మండలాన్ని తీసుకొని అందులో రెవెన్యూ సదస్సులు నిర్వహించి అధికారులే ప్రజల వద్దకు వెళ్లి సమస్యలను తెలుసుకొని పరిష్కరిస్తారని తెలిపారు. జూన్ 2 నుండి ఆగస్టు 15 వరకు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేస్తాము. భూ భారతి చట్టాన్ని చిత్తశుద్ధితో అమలు చేసి రైతులకు న్యాయం చేసి సమస్యలు పరిష్కరించి రైతులకు అండగా నిలవాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ఆబ్కారీ, పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డా.జి. చిన్నారెడ్డి, నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి భూ భారతి చట్టం పై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ రావుల గిరిధర్, వనపర్తి శాసన సభ్యులు తూడి మేఘా రెడ్డి, దేవరకద్ర శాసనసభ్యులు జి. మధుసూదన్ రెడ్డి, నాగర్ కర్నూల్ శాసన సభ్యులు కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి ,రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి, డిసిసిబి అధ్యక్షుడు విష్ణు వర్ధన్ రెడ్డి, మైనారిటీ కార్పొరేషన్ అధ్యక్షుడు ఒబెదుల్లా కొత్వాల్, మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీనివాస్ గౌడ్ , గ్రంథాలయ చైర్మన్ గోవర్ధన్ సాగర్, అదనపు కలెక్టర్ రెవెన్యూ జి.వెంకటేశ్వర్లు, ఆర్డీఓ సుబ్రమణ్యం, రైతులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



స్పోర్ట్స్ కిట్లు అందజేస్తున్న మంత్రులు

# బసవేశ్వరునితోనే సమాజంలో మార్పు

**ఘనంగా శ్రీ మహాత్మ బసవేశ్వర 892వ జయంతి ఉత్సవం..**

**-నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి,ఏప్రిల్ 30 ప్రభాతవార్త:** బసవేశ్వరుడు బోధించిన అభ్యుదయవాద సంప్రదాయమే నేడు లింగాయత్ ధర్మంగా మారిందని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ ఆవరణలో నాగర్‌కర్నూలు జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శ్రీ మహాత్మ బసవేశ్వర 892వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్ రెడ్డి బసవేశ్వరుని చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్ రెడ్డి మాట్లాడుతూ సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక మార్పులకు శ్రీకారం చుట్టిన గొప్ప సంస్కర్త మహాత్మా బస వేశ్వరుడని పేర్కొన్నారు. 12వ శతాబ్దంలో జన్మించిన బసవేశ్వరుడు సమాజంలో కుల వ్యత్యాసాలను, లింగ వివక్షను, వర్ణభేదాలను వ్యతిరేకించిన గొప్ప సమానత్వవాది అని తెలిపారు. బసవేశ్వరుడు స్థాపించిన లింగాయత్ ధర్మం సామాజిక న్యాయం, సద్బుద్ధి, సేవా భావానికి నిలువెత్తు ఉదాహరణ అని పేర్కొన్నారు. బసవన్నను బస వుడు, విశ్వగురు అని పిలవడం అంతే గౌరవంతో కూడిన విషయమని ఎమ్మెల్యే వివరించారు. కర్ణాటకలోని భాగేవాడే బసవేశ్వరుని జన్మస్థలమని,రూ.5 నాణెంపై ఆయన చిత్రాన్ని ముద్రించడం ద్వారా బసవేశ్వరుని ప్రాశస్త్యాన్ని తెలియజేస్తుందన్నారు. సమాజ స్థాపన కోసం కృషి



బసవేశ్వర చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

చేసిన గొప్ప వ్యక్తిని బసవేశ్వరుడు చూపిన మార్గంలో మనమందరం నడవాలని కోరారు. మహాత్మ బసవేశ్వరుని జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. అంతకు ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డిని శాలువాలతో సన్మానించి పుష్పగుచ్ఛం బహుకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ అమరేందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రమ ణ రావు, జిల్లా వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం గౌరవా ధ్యక్షుడు జెమినీ సురేష్, అధ్యక్షులు కెంచే గిరిజా శంకర్, ప్రధాన కార్యదర్శి కెంచే రాజేష్‌కుమార్, కోశాధికారి రాజశేఖర్, సంఘ సభ్యులు నాగ రవిశంకర్, శివశంకర్, శెట్టి రాజేష్, మల్లికార్జున్, ఆకుల సాంబయ్య, శెట్టి శేఖర్, గంగాధర్, రాజ్ కుమార్, సూరజ్, కవిత, మంజుల మరియు వీరశైవ లింగాయతులు, ప్రముఖులు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# స్వప్నం భగ్నమైంది...

మొదటి పేజీ తరువాయి భాగం..

రోదనలు మిన్నంటాయి. ఇంతటి ఘోర రోడ్డు ప్రమాదం జరగడానికి కారణం ఎవరూ అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఆరోజు మంగళవారం జమ్మూలమ్మ ఆలయ భక్తుల రద్దీ ఎక్కువగా వుంటుంది ముందస్తుగా తగు చర్యలు తీసుకోవడంలో సంబధిత అధికారుల వైఫల్యంగా కొందరు భావిస్తున్నారు. గతంలో ఆ ప్రాంతంలో చాలా ప్రమాదాలు జరిగాయని స్థానికులు చెబుతున్నారు, వాటిపై పిర్యాదులు చేశామని, ఈ ప్రాంతంలో స్పీడ్ నివారణ చర్యలు తీసుకోవాలని వినతి చేసుకున్నట్లు చెబుతున్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే కాని చర్యలు తీసుకోరా... ముందస్తుగా ప్రమాద భరితంగా వుండే ప్రాంతాలను గుర్తించి తగు చర్యలు తీసుకునీ ఇలాంటీ ప్రమాదాలు జరగకుండా అరికట్ట వచ్చుగా అని ప్రజలు మండిపడుతున్నారు. ఎర్రవల్లి నుండి జిల్లా కేంద్రంలోకి రావాలంటే పట్టణ శివారు అయిన జన్మించేడు గ్రామం నుండి ట్రాఫిక్ రద్దీగా వుంటుంది. అక్కడి నుండి ప్రతి వాహనం లిమిట్ స్పీడులో వస్తే ఇంతటి ఘోర ప్రమాదాలు జరగవని సూచిస్తున్నారు. స్పీడ్ లో నియమాలు పాటించకుండా డ్రైవర్ అతి వేగంతో బులేరో వాహనం నడపడం వల్ల అదుపుతప్పి ఘోర రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. ఆ సంఘటన స్థలంలో స్పీడ్ బ్రేకర్లు కాని, భారిగేట్లు కాని ఉండుంటే ఇంతటి ప్రమాదం జరిగేది కాదని స్థానికులు చెబుతున్నారు. అదేవిధంగా రోడ్డు, ట్రాఫిక్ అధికారులు రోడ్డు సేఫ్టీ ప్రమాణాలు, స్పీడ్ కంట్రోల్ నియమాలు పాటించడంలో విఫలం అవుతున్నారని ఆరోపిస్తున్నారు. రోడ్డు పక్కనే తిను బండారాలకు అనుమతులు ఎవరు ఇస్తున్నారనీ ప్రశ్నిస్తున్నారు. రోడ్డుపై సురక్షితంగా రాకపోకలు జరగకుండా రోడ్డుకు ఇరుపక్కల చిన్న చిన్న వ్యాపారాలు పెట్టడంతో ఇరుకు మారి ప్రమాదాల భారిన పడుతున్నారని వాపోతున్నారు. రోడ్డుకు పది ఫీట్ల దూరంలో దుకాణ సముదాయాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. పానీపూరి బండి వుండడంతో అక్కడ నిలబడేందుకు ఇరుకుగా మారింది. ఏదో ప్రమాదం జరిగాక, జరగాల్సి న నష్టం జరిగాక మేలుకునే బదులు ముందస్తుగా జాగ్రత్తలు చేపట్టి జిల్లా కేంద్రంలో రోడ్డు పక్కన, ప్రధాన కూడలిలో ఇలాంటి చిరు వ్యాపారాలు ఎన్నో కొనసాగుతున్నాయి. వాటిలో ప్రమాద భరితంగా వున్న వాటిని గుర్తించి, వాటిపై ఇప్పటి నుండి చర్యలు తీసుకుని ప్రమాదాలను నివారించాలని పలువురు సూచిస్తున్నారు. నర్సింగ్ కాలేజీలో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు అందించాల్సి న ప్రభుత్వం విద్యార్థుల రాకపోకల విషయంలో నిర్లక్ష్యం చూపడంతో విద్యార్థులు రోడ్లపైకి వస్తున్నారని, వారికి సరైనా బస్ సౌకర్యం కల్పిస్తే ఇలాంటి ప్రమాదాలకు గురవుతారా అని ప్రశ్నిస్తున్నారు. ఆ విద్యార్థుల కుటుంబాలను ఆర్థికంగా ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. ఇలాంటి సంఘటనలు ఇకముందు పునరావృతం కాకుండా విద్యార్థులు చదువుకుంటున్న కాలేజీల లోనే హాస్టల్ సౌకర్యం కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుకున్నారు. లేదా దూరంగా వున్న హాస్టళ్లకు బస్ సౌకర్యం కల్పించి వారి ప్రాణాలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.

# పోలీస్ స్టేషన్ పరిసరాలను నిత్యం పరిశుభ్రంగా ఉంచుకోవాలి

**అలంపూర్,ఏప్రిల్30 ప్రభాతవార్త :** శాంతినగర పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు, పోలీస్ స్టేషన్ లోని పరిసరాలు ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలని, అత్యవసర పరిస్థితుల్లో వినియోగించే డయల్ 100 కాల్స్ కు వెంటనే స్పందించాలని, పోలీస్ స్టేషన్ కు వచ్చే బాధితులకు తక్షణమే న్యాయం జరిగేలా కృషి చేయాలని జిల్లా ఎస్పీ.టి. శ్రీనివాసరావు, శాంతి నగర ఎస్సైకి సూచించారు. బుధవారం శాంతి నగర్ పోలీస్ స్టేషన్ ను జిల్లా ఎస్పీ ఆకస్మికంగా సందర్శించి స్టేషన్ రికార్డ్స్ ను, స్టేషన్ పరిసరాలను పోలీస్ స్టేషన్ లో సిబ్బంది నిర్వహిస్తున్న విధులను తనిఖీ చేశారు. అందులో భాగంగా సిబ్బంది యొక్క ప్రాపర్ యూనిఫామ్ మెంటేనేన్స్ ను పరిశీలించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను, ఆవరణలో వాహనాల పార్కింగ్ ప్రదేశాలు. రిసెప్షన్, స్టేషన్ రైటర్, టెక్ టీమ్, ఎస్ హెచ్ఓ, మెన్ రెస్ట్ రూమ్, లాక్ అప్ రూమ్ ను పరిశీలించారు. టౌన్ కు సంబంధించి సి సి కెమెరాల కెమెరాల పని తీరును పరిశీలించారు. స్టేషన్ లో రోజు వారీగా నిర్వహిస్తున్న జనరల్ డైరీ, బీట్ డ్యూటీ బుక్స్, సుపీరియర్ ఆఫీసర్స్ విసిటింగ్ బుక్స్ తదితర రికార్డ్స్ ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ స్టేషన్ సిబ్బందితో మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ పరిసరాలను నిత్యం పరిశుభ్రంగా ఉంచుకోవాలని, స్టాఫ్ కు ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకవచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. పోలీస్ స్టేషన్ లో ఎంత మంది సిబ్బంది ఉన్నారు, వారు ఏ ఏ విధులు నిర్వహిస్తున్నారో పరిశీలించారు. పోలీస్ స్టేషన్ నుండి రోజు ఎన్ని బ్లూ కోల్ట్స్, పెట్రో కార్స్ విధులు నిర్వహిస్తున్నాయని, పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్కడెక్కడ ఎన్ని బిట్స్ నడుస్తున్నాయని తెలుసుకొని ప్రాపర్‌గా పెట్రోలింగ్ నిర్వహిస్తూ దొంగతనాలు జరగకుండా చూసుకోవాలని ఆదేశించారు. విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టి రోడ్డు ప్రమాదాలను నియంత్రించాలని అన్నారు, డయల్ 100 కాల్ రాగానే వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని సమస్య పరిష్కరించాలని, బ్లూకోల్ట్స్, పెట్రోల్ కార్ నిరంతరం 247 గస్తీ నిర్వహించాలని , సిబ్బంది తమకు కేటాయించిన కాలనీలలో పూర్తి సమాచారం సిబ్బంది అందరి దగ్గర ఉండాలని, తరచూ గ్రామాలను సందర్శించి సైబర్ నేరాలు, ఆన్లైన్ మోసాల పై , మూడ నమ్మకాలు, బాల్య వివాహాల పై అవగాహన కల్పించాలని అన్నారు. ప్రజలకు ఎప్పుడు అందుబాటులో వుంటూ ప్రజల సమస్యలను తీర్చాలని, ప్రజా ఫిర్యాదులలో ఎటువంటి జాప్యం చేయకుండా తక్షణమే స్పందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డి. ఎస్పీ వై. మొగులయ్య, సిఐ టాటా బాబు, ఎస్సై నాగ శేఖర్ రెడ్డి పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## పది పలితాల్లో గిరిజన గురుకుల విద్యార్థుల ప్రభంజనం



**వనపర్తి, ఏప్రిల్ 30 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం పదవ తరగతి ఫలితాలు విడుదల చేసిన ఫలితాలలో వనపర్తి పట్టణంలో గల తెలంగాణ గిరిజన గురుకుల పాఠశాలకు సంబంధించిన 66 మంది 98 శాతం ఉత్తీర్ణత సాధించారు. కే అరుణ అనే విద్యార్థి 600 మార్కులకు గాను 562 మార్కులు ,కే ఉష దేవి 557 మార్కులు ,ఎస్ సుజాత 541 మార్కులు సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్ సరస్వతి పాఠశాల వైస్ ప్రిన్సిపల్ కాజా బేగం ఉపాధ్యాయ బృందం తెలిపారు.

## పౌరహక్కులపై అవగాహన సదస్సు

**కృష్ణ,ఏప్రిల్ 30 ప్రభాతవార్త :** పౌర హక్కుల పట్ల అందరూ అవగాహన కలిగి ఉండాలని మండల తహశీల్దార్ బి. వెంకటేష్ సూచించారు. మండల పరిధిలోని తంగడిగి గ్రామంలో బుధవారం నిర్వహించిన పౌర హక్కుల అవగాహన కార్యక్రమంలో గ్రామంలో హక్కులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. పౌరులందరికీ రాజ్యాంగం సమాన హక్కులు కల్పించిందన్నారు. ఒకరు ఇంకొకరిపై వివక్ష చూపితే చట్టారీత్యా నేరం అవుతుందన్నారు. గ్రామంలో అంటరానితనం వంటి అమానుషమైన చర్యలకు పాల్పడితే వ్యక్తులపై చర్యలు ఉంటాయని, ప్రతి ఒక్కరూ చదువుకోవాలని చదువుకోవడం వల్లనే సమాజంలో గౌరవ మర్యాదలు దొరుకుతున్నాయి, చదువు లేకుంటే మన హక్కుల గురించి మనకు కూడా తెలియదని గ్రామంలోని ప్రజలు అందరూ వారి పిల్లలకు సరైన విద్యను అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి వీరేష్, బల్చక్ర కాసిం, సిద్దలింగారెడ్డి, జాన్ తదితర గ్రామస్తులు పాల్గొన్నారు.

## జిల్లా టాపర్ కొల్లూరు ప్రభుత్వ విద్యార్థి

**నవాబుపేట, ఏప్రిల్ 30 ప్రభాతవార్త:** పదవ తరగతి పబ్లిక్ పరీక్షలలో కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ విద్యార్థులు ప్రభంజనం సృష్టిస్తున్నారు. మండల పరిధిలోని కొల్లూరు జిల్లా పరిషత్ హైస్కూల్ లో 579 మార్కులతో సాయి చరణ్ తేజ జిల్లా స్థాయి ర్యాంకు సాధించి అందరి మండలాలను పొందుతున్నాడు. ఇంగ్లీష్ మీడియంలో 27 మంది విద్యార్థులకు 27 మంది ఉత్తీర్ణత సాధించి ప్రభుత్వ విద్యార్థులు దేనికి తగ్గకుండా ప్రైవేట్ విద్యార్థులకు దీటుగా రాణించారు. గ్రామస్తులు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు.

## మృతుల కుటుంబాలకు చేయూత!

**చిన్నంబావి, ఏప్రిల్ 30 ప్రభాతవార్త :** మండల పరిధిలోని కొప్పునూరు గ్రామానికి చెందిన మృతుల కుటుంబాలను మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు బీచ్‌పల్లి యాదవ్ పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు. వడ్డేబైరి మృతదేహానికి నివాళులర్పించి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జంగ బిచుపల్లి యాదవ్ జూపల్లి అరుణ్ పంపిణీ రూ.5000 కుటుంబ సభ్యులకు అందజేశారు. అలాగే ఈ నెల 22వ తేదీన వడ్ల జగదీష్ మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను సైతం పరామర్శించి జూపల్లి అరుణ్ పంపిణీ రూ. 5000 కుటుంబ సభ్యులకు అందజేసి వారి కుటుంబాలకు అండగా ఉంటామని జంగ బిచుపల్లి యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వడ్డే వెంకటస్వామి, వడ్డే చిన్న మద్దిలేటి, తదితరులు పాల్గొన్నారు.

## పదిలో కేజిబివి ప్రభంజనం

**అలంపూర్, ఏప్రిల్ 30 ప్రభాతవార్త :** పది పరీక్షలఫలితాలలో అలంపూర్ కేజిబివి బాలికల పాఠశాల 100 కు 100 శాతం రిజల్ట్ రావడం జరిగిందని ప్రిన్సిపాల్ కృష్ణవేణి తెలిపారు. పది పరీక్షలలో 41 మంది విద్యార్థినిలు పరీక్షలు రాయగా 41మంది విద్యార్థినిలు పాస్ అయ్యారన్నారు. స్కూల్ టాప్ ర్యాంకరుగా మహాలక్ష్మి 520,బి. మంజుల 502, రాజేశ్వరి 486, కే. మౌనిక 486, మధులత 479, మార్కులు రావడం జరిగిందని ప్రిన్సిపాల్ తెలిపారు. విద్యార్థినిలకు, పాఠశాల ఉపాధ్యాయులకు, అలంపూర్ ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## విద్యార్థులను సన్మానించిన కలెక్టర్

**నారాయణపేట టౌన్, ఏప్రిల్ 30 ప్రభాతవార్త :** పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో నారాయణపేట జిల్లా 95.13 ఉత్తీర్ణతతో రాష్ట్రస్థాయిలో 19వ స్థానం అందించినందుకు జిల్లా కలెక్టర్ సిక్త పట్నాయక్ విద్యాశాఖను అభినందిస్తూ హర్షం వ్యక్తం చేశారు. జిల్లాలో 572 మార్కులతో ప్రభుత్వ పాఠశాలలు జడ్పీ పాఠశాల బహార్పేట్ కోస్గి విద్యార్థిని నిహారిక సాధించినది. జి పి హెచ్‌ఎస్ శివాజీనగర్ పాఠశాల విద్యార్థిని 564, కేజీబీవీ నారాయణపేట విద్యార్థిని దివ్య 541, శివలీల 541 మార్కులు, అంకిత 534, మార్కులు సాధించిన కేజీబీవీ కృష్ణ విద్యార్థిని రేఖ 568ను అభినందించారు.